# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్ 25.02.2025 | 24 క్యారెట్లు 87,415.00 | కిలో వెండి 1,07,235.00 | 32 °C | సంపుటి:3 | సంచిక:126

www.vishalabharati.com


## రైతుల ఖాతాల్లోకి
# పీఎం కిసాన్ నిధులు

- 19వ విడత విడుదల
- బిహార్‌లోని భాగల్‌పూర్‌లో విడుదల చేసిన ప్రధాని మోడీ
- 9.8 కోట్ల మంది రైతులకు లబ్ధి



విశాలభారతి, నేషనల్ బ్యూరో:

పీఎం కిసాన్ 19వ విడత నిధుల్ని సోమవారం(ఫిబ్రవరి 24న) ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేశారు. తాజాగా విడుదల చేసిన రూ.22వేల కోట్లతో 9.8 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. బిహార్‌లోని భాగల్‌పుర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ ఈ 'పీఎం కిసాన్' నిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతుల సంక్షేమానికి ఎన్‌డీఏ కూటమి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. 'కేంద్ర ప్రభుత్వం రూ.1,100 కోట్లతో బిహార్‌లో 4 కొత్త వంతెనలను

..మిగతా 2 లో



# కార్మికులు క్షేమంగా బయటికొస్తారు..
## మాకు ఆ నమ్మకం ఉంది..

- వారిని కాపాడేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం
- ఇంత పెద్ద ప్రమాదం గతంలో ఎన్నడూ జరగలేదు
- కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటాం
- ఈ ప్రమాదాన్ని రాజకీయం చేయొద్దు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- సంఘటనా స్థలంలో పరిస్థితులను స్వయంగా పర్యవేక్షిస్తున్న మంత్రి
- ముమ్మరంగా కొనసాగుతున్న సహాయక చర్యలు
- రంగంలోకి ర్యాట్ మైనింగ్ బృందాలు, స్నిప్పర్ డాగ్స్

*“శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ టన్నెల్‌లో జరిగిన ప్రమాదం చాలా విషాదకరమని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి తెలిపారు. ఈ ఘటనలో టన్నెల్‌లో చిక్కుకున్న 8 మంది కార్మికులు ప్రాణాలతో బయటకు వస్తారని ఎక్కడో చిన్న ఆశ ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. టన్నెల్ వద్ద జరుగుతున్న సహాయ చర్యలను కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డితో కలిసి పర్యవేక్షించారు.*

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

అనంతరం.. మీడియా మాట్లాడిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. టన్నెల్‌లో చిక్కుకున్నవారిని రక్షించడమే తమ ముందున్న ప్రధాన బాధ్యత అని.. కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని కోమటిరెడ్డి తెలిపారు. అయితే.. ఇంత పెద్ద ప్రమాదం గతంలో ఎప్పుడూ జరగలేదన్నారు. వారంతా వందల కిలోమీటర్ల దూరం దాటి పని కోసం వచ్చారని తెలిపిన మంత్రి కోమటిరెడ్డి.. అందరూ ప్రాణాలతో బయటికి వస్తారనే ఆశ మాత్రం తనకు ఉందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.

**రాజకీయం చేయొద్దు..**

ఇదే క్రమంలో.. సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించే హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఎస్ఎల్బీసీ ప్రాజెక్టును గత ప్రభుత్వమే పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ నేతల్లగా

..మిగతా 2 లో




## మార్చి 20న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు

- రాష్ట్రంలో 5 స్థానాలకు పోలింగ్
- 3న నోటిఫికేషన్.. 10 నుంచి నామినేషన్లు
- షెడ్యూల్ విడుదల చేసిన ఈసీ
- కాంగ్రెస్‌కు నాలుగు సీట్లు దక్కే అవకాశం
- ప్రచారంలో జీవన్‌రెడ్డి, జగ్గారెడ్డి, కుసుమ్, అంజన్, బండ్ల గణేశ్, సంపత్, షబ్బీర్ పేర్లు
- రెండు స్థానాల్లో పోటీ చేసే యోచనలో బీఆర్ఎస్

2 లో



## ఒకే కాన్పులో ముగ్గురు శిశువులు

2 లో

- గజ్వేల్‌లోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో ఘటన
- 8 ఏళ్ల తర్వాత గర్భం దాల్చిన మహిళ
- శిశువులు ఆరోగ్యంగా ఉన్నారన్న వైద్యులు



## కృష్ణా నీళ్ల పంపకాలపై..
# మీరూ మీరూ తేల్చుకోండి

- పంటలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోండి
- ఇరు రాష్ట్రాలకు స్పష్టం చేసిన కేఆర్ఎంబీ
- 26న మరోసారి సమావేశం

విశాలభారతి, స్టేట్ బ్యూరో

నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాల కింద రెండు రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న పంటలను దృష్టిలో ఉంచుకొని నీటి అవసరాలపై ఓ నిర్ణయానికి రావాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఛైర్మన్ సూచించారు. రెండు రాష్ట్రాల సంబంధిత చీఫ్ ఇంజనీర్లు మంగళవారం సమావేశమై ఓ అభిప్రాయానికి రావాలని పేర్కొన్నారు. ఆ తర్వాత బుధవారం కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశమై నీటి విడుదల విషయమై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కృష్ణా బోర్డు ఛైర్మన్ అతుల్ జైన్ నేతృత్వంలో హైదరాబాద్ జలసౌధలో జరిగిన ప్రత్యేక సమావేశంలో

..మిగతా 2 లో

## కుంభమేళాకు వెళ్లొస్తూ
# తిరిగి రాని లోకాలకు..

- వారణాసి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- ముగ్గురు సంగారెడ్డి వాసుల దుర్మరణం
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ప్రస్తుతం మహా కుంభమేళా జరుగుతోంది. పుణ్య స్నానాలు ఆచరించడానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివెళ్తున్నారు. అయితే ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి వద్ద ఘోర రోడ్డు ప్రమాద ఘటన చోటుచేసుకుంది. ఈ ఘోర ప్రమాదంలో సంగారెడ్డి వాసులు ముగ్గురు దుర్మరణం

..మిగతా 3 లో

# కేసీఆర్, కేటీఆర్‌కు.. బీజేపీ అండ

## వారిని కాపాడుతున్నది కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లే



- ప్రభాకర్‌రావు, శ్రవణ్ రావును అమెరికా నుంచి ఎందుకు రప్పించట్లేదు
- వారిని తీసుకొచ్చిన 48 గంటల్లో బీఆర్ఎస్ నేతలను బొక్కలో వేస్తాం
- ఫామ్‌హౌస్ నుంచి సర్కారుపై కేసీఆర్ కుట్రలు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అభ్యర్థులు దొరకలేదు
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్, కవిత ఎవరికి ఓటేస్తారు..
- కాంగ్రెస్ ఓడించాలనడంలో మతలబేంటి..?
- బీసీ రిజర్వేషన్లకు బీజేపీ అడ్డుపడుతోంది
- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి

విశాలభారతి, స్టేట్‌బ్యూరో:

బీఆర్ఎస్, బీజేపీ మధ్య చీకటి ఒప్పందం ఉందని సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిజామాబాద్, మంచిర్యాల, కరీంనగర్‌లో నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఒప్పందంలో భాగంగానే కాంగ్రెస్‌ను ఓడించాలని బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేస్తున్నారని

..మిగతా 3 లో



## దమ్ముంటే సీబీఐ విచారణ కోరండి

- దోషులందరినీ బొక్కలో వేస్తాం
- మీరు విచారణ చేస్తూ.. మమ్మల్ని ప్రశ్నించడమేమిటి..?
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే చీకటి ఒప్పందం
- సీఎం రేవంత్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి భయం
- బీసీ రిజర్వేషన్లపైనా సీఎం అబద్ధాలు చెబుతున్నారు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు

## నేను కేంద్ర మంత్రి కాకుండా
# అడ్డుకున్నది వాళ్లే



- బీసీలను తక్కువ చేస్తూ చూస్తూ ఊరుకోం
- రాహుల్ మాటిచ్చాడు కాబట్టే కులగణన
- నాడు రేవంత్‌ను రెడ్లే వ్యతిరేకించారు
- ఇప్పుడు ఆయన చుట్టూ చేరి.. భజన చేస్తున్నారు
- కులగణన చేసిన సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు
- సొంత పార్టీ నేతలపై అంజన్ కుమార్ యాదవ్ ఫైర్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

“కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మాటిచ్చాడు కాబట్టే రాష్ట్రంలో కులగణన సాధ్యమైంది. లేకుంటే.. సాధ్యమయ్యేది కాదు. గతంలో రెడ్లే రేవంత్‌రెడ్డిని వ్యతిరేకించారు. ఇప్పుడు వాళ్లే ఆయన చుట్టూ చేరి, భజన చేస్తున్నారు. రేవంత్

..మిగతా 2 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం, 25.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## నేను కేంద్ర మంత్రి కాకుండా అడ్డుకున్నది వాళ్లే

తరువాయి భాగం

కష్టకాలంలో ఉన్నప్పుడు మనం(యాదవులు) అండగా నిలిచాం. అందుకే.. యాదవుల సదర్‌ను రాష్ట్ర పండుగగా ప్రకటించారు'' అని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. యాదవ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఆదర్శ్‌నగర్‌లోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన రెడ్డి సామాజికవర్గంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ''నా ఎదుగుదలకు రెడ్డి సామాజిక వర్గం అడ్డుపడింది. కేంద్ర మంత్రి కావాల్సిన నన్ను.. కొందరు రెడ్డి నాయకులు కాళ్లు పట్టి గుంజారు'' అని వ్యాఖ్యానించారు. జనాభాలో సగం ఉన్న బీసీలకు రెండు రాజ్యసభ స్థానాలు చాలా? అని ప్రశ్నించారు. ''వాళ్లు(రెడ్లు) ఎంత మంది ఉన్నరు..? ఎందరు మంత్రులయ్యిండ్రు..? మనకు మంత్రి పదవులిస్తే.. గొర్లు, బర్ల శాఖలిస్తరు. రెవెన్యూ, ఫైనాన్స్ వంటి పవర్‌ఫుల్ మినిస్ట్రీలు ఒక్కటీ ఇవ్వలేదు. నేను సికింద్రాబాద్ ఎంపీ సీటు అడిగితే.. ఓడిపోయిన వాళ్లకు ఇవ్వొద్దని పార్టీ నిర్ణయం తీసుకుందన్నరు. జీవన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఓడిపోతే ఎంపీ టికెట్ ఎలా ఇచ్చారు..? చేవేళ్ల, నల్లగొండ, సికింద్రాబాద్ టికెట్లు రెడ్లకు ఇయ్యలేదా..? బయట పార్టీలోకి వెళ్లిన దానం నాగేందర్ ఇంటికి వెళ్లి టికెట్ ఇచ్చారు. నాకు అవకాశమిస్తే రెండు లక్షల మెజార్టీతో గెలిచేవాడిని'' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్రకారం కులగణన చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు కులగణనను విజయవంతం చేయడానికి కారణమైన సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, సీఎం రేవంత్ పటాలకు పాలాభిషేకం చేశారు. తాను ఎవరి మెప్పుకోసమో మాట్లాడడం లేదని, ఒక నాయకుడు అనిల్‌యాదవ్‌కు రాజ్యసభ ఇచ్చామని చెబుతున్నాడని, ఉమ్మడి రాష్ట్రంలో యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్‌గా అనిల్ ఎన్నికయ్యాడని గుర్తుచేశారు. ''ఈ నాయకులు(రెడ్లు) ఎవరినైనా ఎదగనిచ్చారా? ఆలుమగలు, తండ్రీకొడుకులు 20 ఏళ్లుగా పదవులను అనుభవిస్తున్నారు(రెడ్లనుద్దేశించి). బీసీలను మాత్రం అణగదొక్కుతున్నారు'' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఇప్పుడు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నానని, ఆ పదవి రాకుండా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జానారెడ్డి, ఇతర భజనపరులైన రెడ్లు అడ్డుకున్నారని ఆరోపించారు. లాలూప్రసాద్ యాదవ్ సోనియాగాంధీకి విషయం చెప్పి, తనకు ఈ పదవినిప్పించారన్నారు.

## దమ్ముంటే సీబీఐ విచారణ కోరండి

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగమంతా పచ్చి అబద్దాలు, అర్ధ సత్యాలతో నిండిపోయింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటమి ఖాయమనే భయం ఆయనలో స్పష్టంగా కన్పిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ అన్నారు. రేవంత్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వం చేసిన స్కాంలపై రాష్ట్రప్రభుత్వం విచారణ చేస్తూ... మమ్ముల్ని అరెస్ట్ చేయమనడం విడ్డూరంగా ఉందన్నారు.మీరు చీకటి ఒప్పందాలు చేసుకుని మాపై బురద చల్లుతారా? అని ప్రశ్నించారు. దమ్ముంటే బీఆర్ఎస్ స్కాంలన్నీ సీబీఐకి అప్పగించండి, దోషులందరినీ బొక్కలో వేస్తామని స్పష్టం చేశారు.ఇంటెలిజెన్స్ సహా అన్ని సర్వే సంస్థలన్నీ బీజేపీ గెలుపు తథ్యమని తేల్చేశాయి. కాంగ్రెస్ 3వ స్థానానికి పడిపోతుందని నివేదికలివ్వడంతో దిక్కుతోచని ముఖ్యమంత్రి హడావుడిగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి వచ్చారని బండి సంజయ్ అన్నారు. ఒకే రోజు 3 జిల్లాల్లో 3 మీటింగ్‌ల్లో పాల్గొని అబద్ధాలాడుతూ, ఓటర్లను బ్లాక్ మెయిల్ చేసేలా మాట్లాడుతూ బెదిరింపులకు పాల్పడ్డరన్నారు. మరోవైపు గెలిచినా ఓడినా ప్రభుత్వానికి ఢోకా లేదు... నాకేం ఫరఖ్ లేదని బుకాయిస్తున్నడన్నారు. అంత ధీమా ఉంటే ఎన్నికల ప్రచారానికి ఎందుకు వచ్చినట్లు? చరిత్రలో ఇంతవరకు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఏ ముఖ్యమంత్రి కూడా పాల్గొన్న దాఖలాల్లేవని ఎద్దేవా చేశారు. ఓటమి భయం పట్టుకుంది కాబట్టే ఎన్నికల్లో పాల్గొంటూ డబ్బు, అధికార బలంతో ఎలాగైనా గెలవాలని చూస్తున్నారని, దీనికితోడు ఓడిపోతే మీ సమస్యలను పరిష్కరించబోనంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని బండి సంజయ్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ రేస్, గొర్రెల స్కాంలపై మాట్లాడిన వ్యాఖ్యలు చూస్తే... ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నారా? లేక మేము ఉన్నామా? అనే అనుమానం వస్తోందని ఏద్దేవా చేశారు. లా అండ్ ఆర్డర్ రాష్ట్రం పరిధిలోనిది. కేసీఆర్ కుటుంబం, బీఆర్ఎస్ నేతలు స్కాంలు చేసింది రాష్ట్రంలోనే... దొచుకున్న సొమ్మంతా తెలంగాణ ప్రజలదే. విచారణ చేస్తున్నది రాష్ట్ర ప్రభుత్వమే. కొంత మంది నిందితులను అరెస్ట్ చేసింది ప్రభుత్వమే. లా అండ్ ఆర్డర్ మీ చేతిలో పెట్టుకుని మీరేందుకు అరెస్ట్ చేయలేదని కేంద్రాన్ని నిందించడం చూస్తుంటే నవ్వొస్తుందని బండి అన్నారు. ప్రభాకర్ రావు, శ్రవణ్ విదేశాలకు పోతే.... కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు సహా ఆయా స్కాంల సూత్రధారులు తెలంగాణలోనే ఉన్నారు కదా? మరి వాళ్లను ఇన్నాళ్లుగా ఎందుకు అరెస్ట్ చేయలేదు? అని ప్రశ్నించారు.

అన్ని ఆధారాలున్నాయని చెబుతూ రాధా కిషన్ రావుసహా కొందరు అధికారులను అరెస్ట్ చేసి 10 నెలలకుపైగా జైల్లో ఉంచిన మీరు కేసీఆర్ కుటుంబాన్ని ఎందుకు అరెస్ట్ చేయలేదు? పైకి తిడుతున్నట్లుగా నటిస్తూ కేసీఆర్ కుటుంబంతో చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నారన్నారు. అరెస్ట్ కాకుండా కాపాడుతూ ఆయా కేసులను నీరుగారుస్తున్నది మీరు కాదా? అని ప్రశ్నించారు. మీకు నిజంగా నిజాయితీ ఉంటే ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ రేస్, గొర్రెల స్కాం, కాళేశ్వరం, కేటీఆర్ బామ్మర్ది డ్రగ్స్ వ్యవహారంపై సీబీఐ విచారణ జరపాలని లేఖ రాయండని సూచించారు. ఆయా కేసుల్లో దోషులెవరైనా అరెస్ట్ చేసి బొక్కలో వేయించే బాధ్యత కేంద్రం తీసుకుంటది. రాష్ట్ర ప్రభుత్వం కోరకుండా న్యాయ స్థానాల ఆదేశాలు లేకుండా సీబీఐ తనంతట తాను విచారణ జరిపే అధికారం లేదని తెలిసి ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి కేంద్రంపై బురద చల్లడం ఆయన దివాళా కోరుతనానికి నిదర్శనమని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలోనూ ముఖ్యమంత్రి అర్ధ సత్యాలు, అబద్దాలతోనే ప్రజలను మభ్యపెడుతున్నారు. సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల జనాభా 51 శాతం ఉందని, ఆ సంఖ్యను 46 శాతానికి ఎట్లా తగ్గిస్తారని అసెంబ్లీ సాక్షిగా నాటి ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న కేటీఆర్, హరీష్‌రావులే చెప్పారు.

## ఒకే కాన్పులో ముగ్గురు శిశువులు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ఒకే కాన్పులో ముగ్గురు పండంటి బిడ్డలకు ఓ మహిళ జన్మనిచ్చిన అరుదైన ఘటన సంగారెడ్డి జిల్లాలోని గజ్వేల్ పట్టణంలో ఉన్న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగింది. తమకు వివాహమై ఎనిమిదేళ్లయినప్పటికీ సంతానం కలగకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైనప్పటికీ ఎట్టకేలకు ముగ్గురు పండంటి బిడ్డలు జన్మించడంతో ఆ దంపతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ముగ్గురు శిశువులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు.

సిద్దిపేట జిల్లా ములుగు మండలంలోని అడవి మసీదు గ్రామానికి చెందిన నాగరత్న నర్సింహులుకు వివాహమై ఎనిమిదేళ్లు అవుతుంది. పెళ్లై ఇన్నేళ్లవుతున్నప్పటికీ సంతానం కలగకపోవడంతో ఆ దంపతులు ఇద్దరూ తీవ్ర మనోవేదనకు గురయ్యారు. అయితే ఐవీఎఫ్ విధానం ద్వారా పిల్లలు కలుగుతారని తెలుసుకున్న నాగరత్న ఓ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. అనంతరం గజ్వేల్ పట్టణంలో ఉన్న జిల్లా ప్రభుత్వాసుపత్రికి ఆమె వచ్చి వైద్యసహాయం పొందారు. ఆ విధంగా క్రమంతప్పకుండా మూడో నెల నుంచే చెకప్‌లు చేయించుకునేది. ఎట్టకేలకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నాగరత్న ముగ్గురు పండంటి బిడ్డలకు జన్మనిచ్చింది. వైద్యనిపుణులు ఆమెకు సీజేరియన్ చేసి చికిత్సనందించారు. నాగరత్నకు ఇద్దరు మగబిడ్డలు, ఓ ఆడబిడ్డ పుట్టారని వైద్యులు వివరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయన్నారు. ఇందులో భాగంగానే ముగ్గురు పిల్లలు జన్మించడం చాలా సంతోషమన్నారు.

## రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్ నిధులు

తరువాయి భాగం

నిర్మిస్తుంది. కాంగ్రెస్ సహా ఇతర పార్టీలు రాష్ట్రాన్ని నాశనం చేశాయి. కానీ బిహార్ సంక్షేమానికి ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని ప్రధాని మోదీ అన్నారు. రైతులకు ఏటా ఒక్కో విడత రూ.2,000 చొప్పున మూడు విడతల్లో రూ.6,000 సాయం అందించే 'పీఎం కిసాన్' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2019 ఫిబ్రవరి 24న ప్రారంభించింది. ఇప్పటి వరకు 11 కోట్ల మంది రైతులకు 18 వాయిదాల్లో రూ.3.46 లక్షల కోట్లు అందజేసింది.



# కార్మికులు క్షేమంగా బయటికొస్తారు..

### ముమ్మరంగా సహాయక చర్యలు

**ఎస్ఎల్‌బీసీ ఘటనలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. టన్నెల్ లోపల ఇద్దరు ఇంజనీర్లు, ఇద్దరు ఆపరేటర్లు, నలుగురు కార్మికులు చిక్కుకున్నట్టు అధికారులు తేల్చగా.. వారిని కాపాడేందుకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ బృందాలు, హైడ్రా, ఇండియన్ ఆర్మీ, స్పెషల్ బెటాలియన్ల ఆధ్వర్యంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పెద్ద ఎత్తున మట్టిదిబ్బలు ఉండటంతో పాటు నీళ్లు బురద ఎక్కువగా ఉండటం వల్ల సహాయక చర్యలకు ఇబ్బంది ఏర్పడుతున్నట్టు తెలుస్తోంది.**

తరువాయి భాగం

ఏళ్ల తరబడి ఫాంహౌజ్‌లో పడుకోలేదని ఎద్దేవా చేశారు. తమను పంపించి సహాయక చర్యలు సమీక్షిస్తున్నారని తెలిపారు. ట్విట్టర్ ఉంది కదా అని కేటీఆర్ ఏది పడితే అది పోస్టులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసిన కోమటిరెడ్డి.. ప్రమాదాన్ని రాజకీయం చేయాలనుకుంటే అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని తెలిపారు.



**అన్ని మార్గాలను ప్రయత్నిస్తున్నాం..**

ఈ సందర్భంగా ఎక్స్(ట్విట్టర్)లో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పోస్టు పెట్టారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద సహాయక చర్యలను పర్యవేక్షించినట్టు తెలిపారు. ఎంత కష్టమైనా సరే టన్నెల్‌లో చిక్కుకున్న 8 మందిని కాపాడేందుకు ఉన్న అన్ని మార్గాలను ప్రయత్నించాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా జరిగిన టన్నెల్ ప్రమాద సంఘటనల్లో చిక్కుకున్న భాధితులను కాపాడిన నిపుణుల అనుభవాలను తీసుకొని వారిని సురక్షితంగా కాపాడే ప్రయత్నం చేస్తున్నామని చెప్పుకొచ్చారు.

**స్లీపర్ డాగ్ సేవలు**

ప్రమాదంలో చిక్కుకున్న వారిని వెలికితీయడానికి కేంద్ర, రాష్ట్ర విపత్తు బృందాలతో పాటు ఆర్మీ, నేవి, సింగరేణి, కేంద్ర ప్రభుత్వ రహదారుల విభాగం, జేపీ, నవయుగ లకు చెందిన ఉన్నతాధికారుల బృందం ఇప్పటివరకు ఏడు సార్లు టన్నెల్ లో తనికీలు నిర్వహించాయి. వీరి బృందంలో దాదాపు 584 నిపుణులైన సిబ్బంది ఉన్నారు. ఉత్తరాఖండ్ లో జరిగిన విపత్తులలో ఈ బృందాలు రెస్క్యూ ఆపరేషనలను సమర్థవంతంగా నిర్వహించాయి. వీరితోపాటు 14 మంది ర్యాట్ (ర్యాట్ హోల్ టీమ్)మైనర్స్ ల సేవలను ముమ్మరంగా ఉపయోగిస్తున్నారు. వీరితోపాటు , టన్నెల్ లో ఉన్న వారి ఆచూకి తెలుసుకునేందుకు స్నిప్పర్ డాగ్స్ లను కూడా రప్పించారు.అయితే, నీరు ఉన్నందున ఈ స్నిప్పర్ డాగ్స్ లోపలికి వెళ్లలేక పోయాయి. ఇప్పటికే డ్యామేజి అయిన కన్వీయర్ బెల్ట్ కు మరమ్మత్తులు చేపట్టారు. కాగా, టన్నెల్ లోపలికి పై నుండి రంధ్రం చేసి లోపలికి వెళ్ళాలన్న (వర్టికల్ డ్రిల్లింగ్ ) ప్రతిపాదనను తోసిపుచ్చారు. 5 గ్యాస్ కట్టింగ్ మిషన్లు రేయిం, పగల్లు పని చేస్తున్నాయి.


**అధికారులతో మంత్రి సమీక్ష**

టన్నెల్ లో సహాయ కార్యక్రమాలను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దోమలపెంట ప్రాజెక్టు సైట్ లో ఉండి పర్యవేక్షిస్తున్నారు. సోమవారం సాయంత్రం జేపీ కార్యాలయంలో సహాయ కార్యక్రమాలపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ , స్థానిక ఎమ్మెల్యే డా. వంశీ కృష్ణ, హైడ్రా కమీషనర్ రంగనాథ్, ఆర్మీ, నేవి, NDRF, SDRF, MoRTH, నవయుగ, SCCL, జేపి సంస్థల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం విలేకరులతో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, టన్నెల్ లో చిక్కుకున్నవారిని వెలికితీయడానికి అన్ని ప్రయత్నాలను చేస్తున్నట్టు ప్రకటించారు. ఇప్పటికీ వారు సజీవంగా ఉన్నట్టు ఆశాభావం వ్యక్తం చేశారు. టన్నెల్ లో చిక్కుకున్న ఒక అధికారి మొబైల్ ఫోన్ రింగ్ అయిందని, దాని ప్రకారం సిగ్నల్ తో వారి లొకేషన్ గుర్తించామన్నారు.

## హ్యాట్సాఫ్‌టు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

- బాధితులను కాపాడేందుకు తీవ్ర కృషి చేస్తున్న మంత్రి
- టన్నెల్ లోకి వెళ్లి రెస్క్యూ పరిస్థితులు స్వయంగా పరిశీలన
- అధికారులు వద్దన్నా వినని మంత్రి
- ప్రశంసలు కురిపిస్తున్న నెటిజన్లు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:



తలపై సేఫ్టీ క్యాప్ లేదు.. కాళ్లకు కన్‌స్ట్రాక్షన్ సేఫ్టీ షూస్ లేవు.. అధికారులు వద్దంటున్నా.. సహచర ఎమ్మెల్యేలు వారిస్తున్నా.. టన్నెల్ లోపలికి వెళ్లి రెస్క్యూ స్థితిగతులను స్వయంగా పరిశీలించారు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి. భాధితులను కాపాడేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నారు. మూడు రోజుల ఉత్కంఠ.. 8 మంది ప్రాణాలతో ముడిపడ్డ అంశం.. ఒకవైపు నీతి తప్పిన ప్రతిపక్ష పార్టీ విమర్శలు.. అయినా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఏ మాత్రం తొణకలేదు, బెణకలేదు. కానీ గుండెల్లో ఒక బాధ మాత్రం ఆయన్ని మెలిపెడుతూనే ఉంది.. ఎక్కడెక్కడి నుంచి వచ్చారో ఆ కార్మికులు.. వారి కుటుంబాలకు ఏం చేస్తామని చెప్పివచ్చారో.. ఎలాగైనా వారిని ప్రాణాలతో రక్షించాలని తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా.. రెస్క్యూ ఆపరేషన్లలో నిష్ణాతులను తీసుకురావాలని అధికారులను ఆదేశించడం మాత్రమే కాదు.. స్వయంగా రంగంలోకి దిగి తనకు తెలిసిన మిత్రుల ద్వారా తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాదు... దేవుడి దయతో చిన్న చిన్న గాయాలతో ఎవరైనా బయట పడితే కాపాడేందుకు అపోలో హాస్పిటల్ నుంచి ఆక్సిడెంట్ పెషేంట్స్ ని ట్రీట్ చేసిన అనుభవం కలిగిన డాక్టర్ల బృందాన్ని పిలిపించారు. ఒకవైపు అవిశ్రాంత మానవ ప్రయత్నం చేస్తూనే.. టన్నెల్ లో చిక్కుకున్న వారు క్షేమంగా బయటికి రావాలని శ్రీశైలం మల్లన్నను ప్రార్థిస్తూనే ఉన్నారు. నిజమైన నాయకుడు ఎలా ఉండాలో చూపిస్తున్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కి హ్యాట్సాఫ్ చెప్తున్నారు నెటిజెన్లు.

## కృష్ణా నీళ్ల పంపకాలపై.. మీరూ మీరూ తేల్చుకోండి

తరువాయి భాగం

తెలంగాణ నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్ కుమార్, ఏపీ ఇంజినీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వరరావు, ఇంజనీర్లు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే వాటాకు మించి నీటిని వాడుకున్నందున నిలువరించాలని తెలంగాణ నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా బోర్డు ఛైర్మన్‌ను కోరారు. శ్రీశైలం నుంచి ఉన్న పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి, తదితరాల ఔట్ లెట్ల నుంచి ఏపీ నీటి వినియోగాన్ని పూర్తి ఆపాలని అన్నారు. తాగునీటి అవసరాల కోసం తమకు శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో పది టీఎంసీల చొప్పున అందుబాటులో ఉంచాలని కోరారు.సముద్రంలోకి వృధాగా పోయే వరద నీటిని తాము వినియోగించుకున్నామని, పరిగణలోకి తీసుకోరాదని ఏపీ ఈఎన్సీ అన్నారు. సాగర్, శ్రీశైలం కింద పంటలు ఉన్నాయని, వాటికి సరిపడా నీరు అవసరమని పేర్కొన్నారు. వరద జలాల వినియోగానికి సంబంధించి కూడా సమావేశంలో లెక్కలు తీసినట్లు తెలిసింది. నల్గొండ సీఈ అజయ్‌తో మాట్లాడేందుకు ప్రయత్నిస్తే ఎస్ఎల్బీసీ సహాయక చర్యల్లో ఉన్నందున అందుబాటులోకి రాలేదు. దీంతో ఏపీ సీఈని మంగళవారం నల్గొండ వెళ్లి అక్కడే మాట్లాడాలని సూచించారు. ఆ తర్వాత బుధవారం జరగనున్న త్రిసభ్య కమిటీ సమావేశంలో నీటి విడుదలకు సంబంధించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కృష్ణా బోర్డు సమావేశం అనంతరం ఇరు రాష్ట్రాల ఇంజనీర్ ఇన్ చీఫ్‌లు విడిగా సమావేశమయ్యారు ప్రస్తుత ఏడాది కృష్ణా జలాల్లో తెలంగాణకు 131, ఆంధ్రప్రదేశ్ కు 27 టీఎంసీలు మిగిలి ఉన్నాయని ఇటీవల బోర్డు తేల్చింది. ఈ నెల 11 వ తేదీ వరకు నాగార్జున సాగర్‌లో 510 అడుగుల పైన 63, శ్రీశైలంలో 834 అడుగుల పైన 30 టీఎంసీల నీరు మిగిలి ఉంది.

## మార్చి 20న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించింది. తెలంగాణలోని 5, ఆంధ్రప్రదేశ్‌లోని 5 ఎమ్మెల్సీ స్థానాలకు మార్చి 20న పోలింగ్ నిర్వహించనున్నట్టు సోమవారం వెల్లడించింది. తెలంగాణలో ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, శేరి సుభాష్ రెడ్డి, ఎగ్గె మల్లేశం, మీర్జా రియాజుల్ హసన్ పదవీకాలం మార్చి 29తో ముగియనుంది. మార్చి 3న నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. నామినేషన్ల స్వీకరణకు మార్చి 10 చివరి తేదీ. మార్చి 11న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. మార్చి 13 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. మార్చి 20న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అదేరోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఉంటుంది. మార్చి 24వ తేదీలోపు ఎన్నికల ప్రక్రియ ముగించనున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది.

రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, ఎమ్మెల్యేల సంఖ్యా బలాన్ని పరిశీలిస్తే.. ఈ ఎన్నికల్లో అధిక సీట్లు అధికార కాంగ్రెస్ దక్కించుకోనుంది. ఒక్క స్థానాన్ని ప్రతిపక్ష బీఆర్ఎస్ దక్కించుకునే అవకాశం కనబడుతోంది. తమ స్థానాన్ని తమకే ఇవ్వాలని మజ్లిస్ పట్టుబడితే... ఆ మేరకు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందో? లేదో? వేచి చూడాల్సి ఉంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి అధికార పార్టీ అభ్యర్థులుగా పలువురి పేర్లు ఇప్పటికే ప్రచారంలో ఉన్నాయి. ఓసీ కేటగిరీ నుంచి జీవన్‌రెడ్డి, జగ్గారెడ్డి, బండ్ల గణేశ్, కుసుమ్ కుమార్, కుమార్‌రావు, బీసీల నుంచి అంజన్ కుమార్ యాదవ్, చరణ్ కౌశిక్‌యాదవ్, ఎస్సీ కోటాలో సంపత్‌కుమార్, మైనార్టీ వర్గం నుంచి ఫిరోజ్‌ఖాన్, షబ్బీర్‌అలీ, అజ్మతుల్లా రేసులో ఉన్నారు. అయితే, 10 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలను కలుపుకొని బీఆర్ఎస్‌కు 38 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. మరి పార్టీని వీడిన వారందరూ అధికార పార్టీకి మద్దతు ఇస్తారా? లేక తమ అసంతృప్తిని వెళ్లగక్కుతూ మళ్లీ సొంత పార్టీకి అండగా నిలుస్తారా? అన్న దానిపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

మంగళవారం,
25.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





# కలశ స్థాపనతో ప్రారంభమైన మహా శివరాత్రి ఉత్సవాలు

సూర్యాపేట,విశాలభారతి: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషి మాత దేవాలయంలో వేంచేసి ఉన్న శ్రీ సత్య సాంబశివ స్వామి వారి మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు సోమవారం కలశ స్థాపనతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు బట్టారం వంశీకృష్ణ శర్మ శ్రీ సత్య సాంబశివ స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక మండపంపై గణపతి పూజ పుణ్యాహ వాచనం, కంకణ ధారణ, దీక్ష వస్త్రధారణ, రుద్ర హోమం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన కార్యదర్శి బ్రాహ్మండ్లపల్లి మురళీధర్ మాట్లాడుతూ ఈనెల 26 మహాశివరాత్రి సందర్భంగా 24 గంటలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా తెల్లవారుజామున 6 గంటల నుండి 12 గంటల వరకు భక్తులే స్వయంగా స్వామివారి గర్భగుడిలోకి ప్రవేశించి మీ స్వహస్తాలతో అభిషేకం చేసుకోవచ్చన్నారు. మారేడు దళాలతో పూజ, శివలింగాకృతిలో దీపోత్సవం ఎదుర్కోలు మహోత్సవం, శివ కళ్యాణం నిర్వహిస్తున్నట్లు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహానికి పాత్రులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు బెలిదేఅశోక్, యామా వెంకటేశ్వర్లు, యామ విజయలక్ష్మి, జగదీశ్వరి, బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# కుంభమేళాకు వెళ్లొస్తూ తిరిగి రాని లోకాలకు..



తరువాయి భాగం: చెందారు. వారణాసిలో ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో రోడ్డు పక్కన ఉన్న టిప్పర్ వాహనాన్ని ఢీకొట్టారు. దీంతో ముగ్గురు మరణించగా.. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే మృతులను సంగారెడ్డి వాసులుగా పోలీసులు గుర్తించారు. మృతి చెందిన ముగ్గురు జహీరాబాద్ నీటి పారుదల శాఖ డీఈ వెంకటరామిరెడ్డి (46), ఆయన భార్య విలాసిని (40), మల్గికి చెందిన కారు డ్రైవర్ మల్లారెడ్డి (42) అని పోలీసులు తెలిపారు.ఇదిలా ఉండగా సంగారెడ్డి జిల్లా వాసులు మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స, తక్షణ సహాయక చర్యలను అందించాలని తెలిపారు. దీని కోసం వెంటనే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ అధికారులతో మాట్లాడాలని రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.







# దేవాలయానికి రూ. 50,116 విరాళం

- మండల ప్రజలు రైతులు సుఖ సంతోషాలతో ఉండాలి
- తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి

నూతనకల్ విశాలభారతి: నూతనకల్ మండల వెంకేపల్లి గ్రామంలోని శ్రీశ్రీశ్రీ సీతారామాంజనేయ స్వామి, శ్రీరామలింగేశ్వర స్వామి వార్ల దేవాలయంలో ద్వితీయ వార్షికోత్సవ సందర్భంగా పూజలు నిర్వహించి, దేవాలయానికి 50,116 రూపాయలను తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల ప్రజలు రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని పాడిపంటలు బాగా పండి రైతులకు ,ప్రజలకు మంచి జరగాలని కోరుకున్నామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ చిర్ర విజయ్ కుమార్ ,మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తోనుకునూరి సైదులు గౌడ్, కమిటి సభ్యులు, గ్రామస్తులు ఇమ్మడి జయకుమార్, సైరెడ్డి శంభా రెడ్డి, ఇమ్మడి విజయ్ కుమార్, తీగల ప్రీతం రెడ్డి, పేర్ల గంగరాజు, పాశం శ్రీనివాస్ రెడ్డి ,దేశగాని మల్లయ్య, పాల్వాయి పరుశరాములు, మారోజు సదానంద చారి, పాలవరపు కృష్ణమూర్తి, చిలువేరు శివ, తీపిరెడ్డి లింగారెడ్డి, తీపిరెడ్డి దిలీప్ రెడ్డి, ఆకుల గణేష్, మారగాని వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్, కేటీఆర్‌కు.. బీజేపీ అండ

తరువాయి భాగం

సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కేసుల నుంచి తప్పించుకునేందుకు బీఆర్ఎస్ నేతలు ఢిల్లీలో సాగిలపడుతున్నారన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు అరెస్టు కాకుండా కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లే కాపాడుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ కేసులో నిందితులైన ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావు అమెరికాకు పారిపోతే.. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్‌కి ఇది సాధ్యం కావడం లేదా? అని ఎద్దేవా చేశారు. ఆ ఇద్దరిని రాష్ట్రానికి తీసుకువచ్చిన 48 గంటల్లోనే తాము బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేస్తామని ప్రకటించారు. "కేసీఆర్ ఢిల్లీకి వచ్చి చీకట్లో మీ కాళ్లు పట్టుకున్నందునే వారిని అమెరికా నుంచి రప్పించడంలేదు" అని సీఎం ఆరోపించారు. బండి సంజయ్ ఇప్పటికైనా ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావును తెచ్చి తమకు అప్పగించాలన్నారు. ఈ కేసులో జైలుకు పంపించిన రాధాకిషన్‌రావు, ప్రణీత్‌రావుకు పది నెలల తర్వాతే బెయిల్ వచ్చిందని గుర్తు చేశారు. హరీశ్‌రావు కోర్టుకు వెళ్లి బెయిల్ తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ఫార్ములా ఈకార్ రేసులో ఫైళ్లన్నీ తీసుకెళ్లిన ఈడీ అధికారులు.. కేటీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడంలేదని ప్రశ్నించారు. "ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఎప్పుడూ ఢిల్లీ వెళ్లని బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, కేటీఆర్ ఇప్పుడెందుకు వెళ్తున్నారో, కేంద్ర మంత్రులను ఎందుకు కలుస్తున్నారో అర్థం కావడంలేదా? కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసిన కేటీఆర్ రాష్ట్రానికి చిల్లిగవ్వయినా తెచ్చారా? తెలంగాణకు నిధులు కావాలంటే మాతో కలిసి రావాలి కదా! మీరిద్దరూ చీకట్లో కలిసేది ఎందుకు? బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు చీకట్లో ఒప్పందాలు చేసుకునేందుకే కలుస్తున్నారు" అని రేవంత్ ఆరోపించారు. రాష్ట్రానికి నిధుల కోసం తాము రోజూ పోరాడుతున్నామని, నిధులెలా తేవాలో తమకు తెలుసన్నారు.

**ఫామ్‌హౌస్ నుంచి సర్కారుపై కుట్ర**

తమ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని, కుట్రలు, కుతంత్రాలు చేసి బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తున్నారని సీఎం రేవంత్ ఆరోపించారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో కూర్చొని కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను నిలపలేదని, మరి పట్టభద్రులైన కేసీఆర్, కేటీఆర్, కవిత ఎవరికి ఓటేస్తారని ప్రశ్నించారు. పైగా అభ్యర్థిని నిలబెట్టని పార్టీ.. ఎవరికి ఓటు వేయాలో ఎలా చెబుతుందని నిలదీశారు. పోటీ చేయడానికి ఆ పార్టీకి అభ్యర్థులే లేరని ఎద్దేవా చేశారు. పోటీ ఎందుకు చేయడంలేదని, పోటీ చేయని పార్టీకి రాజకీయ పార్టీ అని చెప్పుకొనే అర్హత ఉందా? అని ప్రశ్నించారు. 2023లో అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ 8 సీట్లలో డిపాజిట్లు కోల్పోతే, అవే సీట్లలో బీజేపీ ఎలా గెలిచిందో ప్రజలకు అర్థం కాదా? అని అన్నారు. పది నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయలేదంటున్న బీఆర్ఎస్ నేతలు.. పదేళ్లలో వారేం చేశారో చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన కొద్ది రోజులకే పార్లమెంట్ ఎన్నికలు వచ్చాయని, దీంతో ఎన్నికల కోడ్ కారణంగా తమకు 8 నుంచి 9 నెలలు మాత్రమే పరిపాలన చేసే అవకాశం వచ్చిందని తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నిరుద్యోగుల సమస్య పరిష్కారం కాలేదని, తెలంగాణ ఉద్యమాన్ని నడిపిన పట్టభద్రులకే ఉద్యోగాలు ఇవ్వలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఉద్యోగాల భర్తీ చేపట్టినట్టు పేర్కొన్నారు. 10 నెలల కాలంలోనే 55,163 ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. కొత్తగా 17వేల మంది టీచర్లను నియమించామని, 35 వేల మందికి పదోన్నతులు కల్పించామని, 22 వేల మందిని బదిలీ చేశామన్నారు. భార్యాభర్తలు ఒకేచోట పనిచేసే అవకాశం కల్పించామన్నారు. బీఆర్ఎస్ చేసిన అప్పులకు.. ప్రతి నెలా రూ.6500కోట్లు వాయిదాలుగా చెల్లిస్తున్నామని తెలిపారు.

**రాష్ట్ర అభివృద్ధికి కిషన్‌రెడ్డి, సంజయ్‌లు అడ్డుపడుతున్నారు..**


"బీసీ కులగణనపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆకాశమంత ఎగిరి దూకుతున్నాడు. తామే బడా బీసీలమని బండి సంజయ్, మోదీ చెబుతున్నారు. అయితే దేశంలో 2021లో బీజేపీ ప్రభుత్వం జనగణన ఎందుకు చేపట్టలేదు?" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. వందేళ్లలో బీసీ కులగణన చేయలేదని, తమ ప్రభుత్వ హయాంలో నెలరోజుల్లోనే చేపట్టి ప్రజల ముందు లెక్కలు పెట్టామని అన్నారు. ప్రభుత్వం కులగణన చేపడితే బీజేపీ నేతలు మాత్రం కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. కేంద్రం జనగణనతోపాటే కులగణన చేసి.. తాము చేసిన కులగణన లెక్కలు తప్పని తేలిస్తే ముక్కు నేలకు రాస్తానని సవాల్ చేశారు. మైనారిటీలను బీసీల్లో ఎలా కలుపుతారని బండి సంజయ్ ప్రశ్నిస్తున్నారని, కానీ.. 1960 నుంచే మైనారిటీలు బీసీ రిజర్వేషన్లు పొందుతున్నారని సీఎం తెలిపారు. గుజరాత్‌లో 29 ముస్లిం కులాలు బీసీ రిజర్వేషన్లను అనుభవిస్తున్నాయని, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, బిహార్‌లోనూ ముస్లింలు బీసీ రిజర్వేషన్ పొందుతున్నారని పేర్కొన్నారు. అవసరమైతే ఆ రాష్ట్రాలకు నిజనిర్ధారణ కమిటీని పంపిస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్ల నుంచి కొట్లాడుతున్నారని సీఎం తెలిపారు. మందకృష్ణ మాదిగకు ప్రధాని మోదీ ముద్దు పెట్టారు తప్ప.. ఎస్సీ వర్గీకరణ లెక్క తేల్చలేదని విమర్శించారు. తాము ఎస్సీ వర్గీకరణకు చట్టం చేశామని గుర్తు చేశారు. హైదరాబాద్ మెట్రో రైల్వే విస్తరణకు అడ్డు పడింది.. అనుమతి ఇవ్వవద్దన్నది కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డేనని ఆరోపించారు. మూసీ ప్రక్షాళనకు, రీజినల్ రింగ్ రోడ్డుకు అనుమతులు రాకుండా, నిధులు ఇవ్వకుండా అడ్డుకుంటున్నదీ ఆయనేనన్నారు.





# అధికార పార్టీ పాటే ..పీఆర్టీయూ పాట

- పీఆర్టీయూ నేతలపై టీచర్లలో చర్చ
- గతంలో కేసీఆర్ చుట్టు.. తాజాగా రేవంత్ రెడ్డి చుట్టూ..
- పీఆర్టీయూ నుంచే గత ఎమ్మెల్సీలు.. అయినా టీచర్ల సమస్యలు ఎక్కడికక్కడే
- అప్పుడూ, ఇప్పుడూ అదే తంతు.. ఓటేసినవారి సమస్యలు గాలికి..
- సొంత సంఘంలోనే నిరసన సెగలు.. నాయకుల తీరుపై విమర్శలు
- కాగితాలకే పరిమితం చేస్తూ చేతులు దులిపేసుకుంటారని విమర్శలు
- తాజాగా సీఎం రేవంత్‌ను కలవడంపై టీచర్ల నుంచి కురుస్తున్న ప్రశ్నల వర్షం




హైదరాబాద్,విశాలభారతి: గతంలో గెలిచింది వాళ్లే.. ప్రభుత్వాలకు అనుకూలంగా వ్యవహరించిందీ వాళ్లే.. ప్రధాన పటిష్ట సంఘంగా చెప్పుకునేదీ వాళ్లే కానీ.. నమ్మి ఓటేసినవారి ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలు మాత్రం ఎక్కడేసిన గొంగళి అక్కడే..! ఏండ్ల తరబడి జరుగుతున్న తంతు ఇదే..!! మా సమస్యలు పరిష్కరించండి మహాప్రభో అంటూ కుయ్యోమొర్రో మొత్తుకున్నా పెడచెవిన పెట్టిన సదరు సంఘం పెద్దలు.. ఇబ్బందులను కాగితాలకే పరిమితం చేసి చేతులు దులిపేసుకున్నారని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలప్పుడు ఇస్తున్న హామీలు తీరా గెలిచిన తర్వాత బుట్టదాఖలు చేయడం వారికి పరిపాటిగా మారిందనే అభిప్రాయాలు టీచర్లలో బలంగా వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వంలో సీఎంను కలిసిన ఆ పెద్దలే.. తాజాగా ముఖ్యమంత్రిని కలిసి మళ్లీ వినతులు సమర్పించి సానుకూల ప్రకటనలు చేయడం పట్ల ఎమ్మెల్సీ ఎన్నికల వేళ వారిపై ప్రశ్నల వర్షం కురుస్తోంది. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లా టీచర్ ఎమ్మెల్సీ గత కొన్నేళ్లుగా పీఆర్‌టీయూ సంఘం నేతలే ఎన్నికయ్యారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన వెంటనే ప్రభుత్వంలో ఏ పార్టీ ఉన్నా సదరు సీఎంను కలిసి ఉపాధ్యాయుల ఇబ్బందులను ఏకరువు పెడతారు. తదనంతరం యథాలాపమే. ఎక్కడ సమస్యలక్కడే.. గాప్‌చుప్ అన్నట్టుగా పరిస్థితి మారిపోతుంది. గతంలో మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, తాజాగా రఘోత్తం రెడ్డి ఇలా అందరూ ప్రభుత్వాలకు మద్దతు తెలిపి అనుకూలంగా వ్యవహరించినవారే. అందుకే పీఆర్‌టీయూ అంటేనే ఎవరు గెలిచినా మళ్లీ ప్రభుత్వానికి మద్దతు ప్రకటించి అంటకాగుతారనే అపవాదు ఉంది. ఈ కారణంగా టీచర్లు, అధ్యాపకుల సంబంధించిన ఎన్నో సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా పడకేశాయి. మెడికల్ బిల్స్, పీఆర్‌సీ, జీవో 317, సకాలంలో ప్రమోషన్లు, బదిలీలు లేకపోవడం, బెనిఫిట్స్, హెల్త్ కార్డు, గురుకులాల సమస్యలు.. చెప్తూ పోతే ఎన్నో పెండిరగ్ పనులు ముందరపడ్డ పాపాన పోలేదు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు నాటి సీఎం కేసీఆర్‌ను కలిసి ఎన్నో సందర్భాల్లో ప్రకటనలు గుప్పించారు. అయినప్పటికీ ఏ ఒక్క సమస్య పూర్తిస్థాయిలో కొలిక్కి రాలేదంటే సదరు ఎమ్మెల్సీలు, పీఆర్‌టీయూ పెద్దలు ఏ మేరకు ఒత్తిడి పెంచారో అర్థమైపోతోంది.

**ఎన్నికలప్పుడే ప్రకటన ఏలా..?**

రెండ్రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన పీఆర్‌టీయూ నేతలు గురుకులాల సంబంధించిన విషయంలో ప్రకటన చేయడం పట్ల టీచర్ల నుంచి ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. గత పదేళ్లుగా రాని ప్రకటన సరిగ్గా ఎన్నికల ముందే ఎలా వచ్చిందని గురుకుల టీచర్లు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలొచ్చినప్పుడే ముందుకొచ్చి తర్వాత ముఖం చాటేస్తున్నారని, నమ్మి ఓటేస్తే ప్రభుత్వాల దగ్గర తమ ఇబ్బందులను తాకట్టు పెట్టేస్తున్నారని ఉపాధ్యాయ, అధ్యాపకులు భావిస్తున్నారు. ఇక నుంచి అంత సులువుగా పీఆర్‌టీయూను నమ్మే పరిస్థితి లేదని, తమ సమస్య పరిష్కారం కోసం కృషి చేసేవారినే ఎన్నుకునేందుకు ఐక్యంగా ముందుకెళ్తామని స్పష్టం చేస్తున్నారు.

**నాటి నుంచి నష్టమే..!**

జులై 2023 నుంచి అమల్లోకి రావాల్సిన కొత్త పీఆర్సీ ఇప్పటివరకు రాలేదు. 33 నెలల పీఆర్సీ బకాయిలు చెల్లించలేదు. పే రివిజన్ కమిషన్ చేసిన.. శిశు సంరక్షణ సెలవులు పెంపు, 20 ఏండ్ల సర్వీస్‌కే పూర్తి పెన్షన్, అలవెన్సుల పెంపు వంటి కీలక సిఫారసులను గత సర్కారు అమలు చేయలేదు. వీటన్నింటిపై కొట్లాడాల్సిన పీఆర్‌టీయూ ఎమ్మెల్సీలు, నేతలు ఏం చేశారని నలుగురు కలిసినచోట ఇదే చర్చ కొనసాగుతోంది. కేజీబీవీ టీచర్లకు కనీస వేతనాలు, రెగ్యులరైజేషన్, మోడల్ స్కూల్ టీచర్లకు సకాలంలో వేతనాలు, కారుణ్య నియామకాలు వంటి ఎన్నో పెండిరగ్ సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత మీది కాదా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో 27న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ కోసం గొంతు వినిపించేవారికే, మండలిలో ప్రశ్నించే వారికే ఓటేస్తామని టీచర్లు, అధ్యాపకులు ముక్తకంఠం వినిస్తున్నారు. ఈ క్రమంలో బీసీ వాదం, బీజేపీ పార్టీ, పలు సంఘాల మద్దతు మల్క కొమరయ్యకు బలంగా మారాయి.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

మంగళవారం,
25.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## పటితో ముగియనున్న మహా కుంభమేళా

విశాలభారతి, నేషనల్ బ్యూరో:మహా కుంభమేళా 2025 చివరి పవిత్ర స్నానానికి ముందు ప్రయాగ్‌రాజ్‌లో భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. కుంభమేళాలో పాల్గొనేందుకు యాత్రికులు నగరంలోకి భారీ సంఖ్యలో ప్రవేశించడంతో దాదాపు 25 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయిందని తెలుస్తోంది. ఈ నెల ప్రారంభంలో జరిగిన ట్రాఫిక్ గందరగోళాన్ని గుర్తుచేస్తూ తాజా ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. జనవరి 13న ప్రారంభమైన మహా కుంభమేళా 2025 మహా శివరాత్రి రోజున జరిగే చివరి పవిత్ర స్నానంతో ముగుస్తుంది. మహా కుంభమేళా చివరి దశకు చేరుకోవడంతో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ట్రాఫిక్ నియంత్రణ, రద్దీ నిర్వహణ, ముఖ్యంగా చివరి పవిత్ర స్నానం నేపథ్యంలో రానున్న రోజుల్లో భక్తుల ప్రయాణం సజావుగా సాగేలా సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నామని ఉత్తరప్రదేశ్ డీజీపీ ప్రశాంత్ కుమార్ తెలిపారు. నిత్యం వేలాది వాహనాలు నగరంలోకి ప్రవేశిస్తున్నప్పటికీ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా నగర పోలీసులు వాహనాలను దారి మళ్లించే పనిలో నిమగ్నమయ్యారని వివరించారు.



## జర్నలిస్టుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ కి టిడబ్ల్యూజేఎఫ్ వినతి

సూర్యాపేట,విశాలభారతి: జర్నలిస్ట్ ల సమస్యలు పరిష్కరించాలని టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు అయితబోయిన రాంబాబు గౌడ్, కార్యదర్శి బుక్క రాంబాబు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం నందు అదనపు కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చి అనంతరం మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జర్నలిస్టులకు సరైన న్యాయం జరుగుతుందని భావించినప్పటికీ కెసిఆర్ ప్రభుత్వంలో ఎలాంటి న్యాయం జరగలేదని అలాగే ఈ ప్రభుత్వంలోనైనా అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. జర్నలిస్టుల పైన రాష్ట్రంలో అనేక దాడులు జరుగుతున్నాయని జర్నలిస్టుల పై దాడులు జరగకుండా ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. ఇళ్ల స్థలాల విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వమే రివ్యూ పిటిషన్ వేసి వాదనలు వినిపించి అనుకూలమైన తీర్పు వచ్చే విధంగా కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలోటిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు అయితబోయిన రాంబాబు గౌడ్, జిల్లా కార్యదర్శి బుక్క రాంబాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్వాయి జానయ్య,నాయిని శ్రీనివాస రావు, జిల్లా సహాయ కార్యదర్శి ఎరుకల సైదులు గౌడ్,ఎలక్ట్రాన్ మీడియా అధ్యక్షులు లింగాల సాయి, కార్యదర్శి నందిపాటి సైదులు, కోశాధికారి వేల్పుల ప్రవీణ్, రూథర్ బిక్షం, కృష్ణమూర్తి, పరమేష్, పుట్ట రాంబాబు, గూడపూరి ప్రభాకర్, షేక్ ఆసిఫ్, వల్దాస్ శంకర్, భాస్కర్, సురేష్, కంచర్ల సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అమరవాది లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేయాలి

- లక్ష్మీనారాయణతో ఆర్యవైశ్యులు ఎంతో నష్టపోయారు.
- సూర్యాపేట పోలీస్ స్టేషన్ లో లక్ష్మీనారాయణపై ఫిర్యాదు చేసిన ఆర్యవైశ్య ప్రముఖులు



సూర్యాపేట,విశాలభారతి: ఆర్యవైశ్యుడై ఉండి బాధ్యతాయుతమైన పదవిలో కొనసాగుతూ ఆర్యవైశ్య రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో కొంతమంది ఆర్యవైశ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్యవైశ్యులను దుర్భాషలాడిన ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ పై కేసు నమోదు చేయాలని సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం మాజీ అధ్యక్షులు మీలా వంశీ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య ప్రముఖులు సూర్యాపేట పోలీస్ స్టేషన్ లో పట్టణ ఇన్స్పెక్టర్ వీర రాఘవులుకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామికవేత్త ఇమ్మడి సోమ నరసయ్య మాట్లాడుతూ ఫిబ్రవరి 13న సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఆర్యవైశ్యులు ముసలివారు, వెదవలు అని సోషల్ మీడియాలో మాట్లాడుతున్నారని ఆలా సంభోదించడం సరికాదన్నారు. ఆర్యవైశ్యుడై ఉండి ఆర్యవైశ్యులను కించపరచడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. 11 ఏళ్లు ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్ష పదవిలో ఉన్న అమరవాది లక్ష్మీనారాయణ ఆర్యవైశ్యుల అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలన్నారు. ఆర్యవైశ్యులకు సమస్యలు వస్తే రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆయన స్పందించకపోతే ఎవరి దగ్గరకు వెళ్లాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్యవైశ్య యువజన సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు మీలా వంశీ మాట్లాడుతూ ఇప్పటికీ 11 సార్లు అధ్యక్ష పదవిలో అమరవాది లక్ష్మీనారాయణ ఉన్నారని ఆయన వల్ల ఆర్యవైశ్యులకు ఒరిగింది ఏమీ లేదన్నారు. పైగా ఈసారి ఎన్నికల ప్రచారంలో ఆర్యవైశ్యులను దుర్భాషలాడడం దారుణమని ఆయనపై వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్యవైశ్యుల అభివృద్ధికి 11 సంవత్సరాలుగా ఆయన ఏం చేశారో చెప్పకుండా తోటి ఆర్యవైశ్యులను దుర్భాషలాడడం ఎంతవరకు సమంజసం అన్నారు. రాష్ట్రంలోని జిల్లాల్లో ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యలపై లక్ష్మీనారాయణకు పట్టింపు లేదని సమస్యల పరిష్కారం కు ఒక ప్రణాళిక తయారు చేసింది లేదన్నారు. అమరవాది లక్ష్మి నారాయణ వ్యాఖ్యలను ఆర్యవైశ్యులమంతా ముక్తకంఠంతో ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు గుండా శ్రీధర్, చింత వెంకన్న, యామ సంతోష్, మహంకాళి శివ, తల్లాడ కృష్ణమూర్తి, మాద్గుల శంకర్, కొత్త వెంకటేశ్వర్లు, కర్నాటి వంశీ, కొత్త వెంకన్న, వంగవీటి రమేష్, దేవరశెట్టి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.




## ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల

- చేయకపోతే పట్టభద్రుల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తాం.
- రాష్ట్ర బడ్జెట్ లో విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయించాలి.
- పుల్లూరి సింహాద్రి పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షులు

సూర్యాపేట,విశాలభారతి: గత మూడు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న 8 వేల కోట్ల ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్షిప్ బకాయిలు చెల్లించకపోతే పట్టభద్రుల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తామని పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షులు పుల్లూరి సింహాద్రి పాల్గొని మాట్లాడుతూ..గత మూడు సంవత్సరాలుగా 8వేల కోట్లకు పైగా ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్షిప్ నిధులు పెండింగ్ లో ఉన్నాయని, ఫీజు రియంబర్స్ మెంట్ పథకం మీదనే ఆధారపడి పేద మధ్యతరగతి విద్యార్థులు చదువుకుంటున్నారని,డిగ్రీ,ఇంజనీరింగ్, పీజీ లు పూర్తయిన వారి సర్టిఫికెట్లు తీసుకోలేకపోతున్నారని, రియంబర్స్ మెంట్ నిధులు చెల్లించకపోతే ప్రైవేట్ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, కావున విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పెండింగ్ స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్ మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని.. లేనిచో పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. అదేవిధంగా వచ్చే రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగ అభివృద్ధికి కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని,లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు నాయకులు, మహేష్,నవీన్, వినయ్,పవన్,రాజు,గోపి,సాయి తదితరులు పాల్గొన్నారు.

## చెరువులు నింపేందుకు ఎమ్మెల్యే చొరవ చూపాలి

- అక్షరం ఎన్జీవో అధ్యక్షుడు కోడి రాములు



మునుగోడు, విశాలభారతి: బ్రాహ్మణ వెళ్ళాంల ప్రాజెక్టు ద్వారా మునుగోడు మండలంలోని చెరువులను నింపేందుకు స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చొరవ చూపాలని అక్షరం ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు కోడి రాములు విజ్ఞప్తి చేశారు. సోమవారం మునుగోడు లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల నల్గొండ నియోజకవర్గంలోని పలు గ్రామాల చెరువులను నింపేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. ఇందులో భాగంగానే నల్లగొండ మండలంలోని పలు చెరువులను నింపుతున్నారని తెలిపారు. చిట్యాల మండలం ఎలికట్టే మీదుగా కిష్టాపురం వరకు ప్రధాన కాలువ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రాజెక్టు నీటితో చెరువులు నింపాలని విజ్ఞప్తి చేశారు. కిష్టాపురం చెరువు నుండి ఇప్పర్తి తాళ్ల వెల్లంల మునుగోడు పెద్ద చెరువు తో పాటు పులిపలుపుల గూడపూర్ చెరువులను గొలుసు కట్టు విధానం ద్వారా నింపే అవకాశం ఉంటుందన్నారు . చెరువులు నింపడం వలన భూగర్భ జలాలు పెరగడంతో బోర్ల ద్వారా సాగు చేసే రైతులకు మేలు కలుగుతుందన్నారు. ప్రస్తుతం మండలంలోని పలు గ్రామాల రైతులు తమ పొలాలకు నీళ్ల ట్యాంకర్ల ద్వారా పంటలను కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే విద్య వైద్యం రవాణా అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టుగానే సాగునీటి విషయంపై అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు

## నారి న్యాయ సదస్సులో మాజీ కౌన్సిలర్ వేములకొండ పద్మకు సన్మానం




సూర్యాపేట,విశాలభారతి తెలంగాణ రాష్ట్ర మహిళ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర నారి న్యాయ సదస్సు కార్యక్రమంలో మన రాష్ట్రంలో లక్ష సభ్యత్వాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం గాంధీభవన్ లో నిర్వహించిన అభినందన సభలో సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన మాజీ కౌన్సిలర్ వేములకొండ పద్మను కాంగ్రెస్ పార్టీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కలంబ, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగలి సునీతరావులు ఘనంగా సన్మానించారు. సభ్యత్వాల నమోదులో భాగంగా సూర్యాపేట జిల్లాను తెలంగాన రాష్ట్రంలో అగ్రభాగాన నిలుపడం పట్ల అభినందించారు. ఈ సందర్భంగా వేములకొండ పద్మ మాట్లాడుతూ సూర్యాపేట నియోజకవర్గ ఇంచార్జి రాంరెడ్డి దామోదర్ రెడ్డి,ఎఐసీసీ సభ్యులు సర్వోత్తంరెడ్డి, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ ల సహకారంతో తాను సూర్యాపేట జిల్లాలో అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయడం జరిగిందన్నారు. మహిళా కాంగ్రెస్ కమిటీని మరింత బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. తన కృషిని గుర్తించి సన్మానించి అభినందించిన రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కు కృతజ్ఞతలు తెలిపారు.




## శ్రీ అన్నపూర్ణ సహిత విశ్వనాథ ఆలయంలో ఘనంగా శివరాత్రి ఉత్సవాల నిర్వహణ

సూర్యాపేట,విశాలభారతి: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం ఎదురుగా గల శ్రీ అన్నపూర్ణ సహిత విశ్వనాథ స్వామి ఆలయం నందు శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇవొ లక్ష్మణరావు, ప్రధాన అర్చకులు వలివేటి వీరభద్రశర్మ అన్నారు. సోమవారం నాడు ఆలయం వద్ద శివరాత్రి ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 26వ తేదిన మహా శివరాత్రి రోజున ఉదయం 4 గంటల నుండి ఆలయంలో రుద్రాభిషేకాలు జరుగుతాయని అన్నారు. ఫిబ్రవరి 27వ తేది గురువారం నాడు ఉదయం రుద్రాభిషేకాలు, రాత్రి శ్రీ అన్నపూర్ణ సహిత విశ్వనాథ స్వామి వారి స్వామి వారి కళ్యాణం వైభవంగా జరుగుతుందని వారు అన్నారు. గురువారం రాత్రి 7:30 కు స్వామి వారిని అమ్మవారిని భాజాభజంత్రీలతో బొడ్రాయి బజార్ నందు గల కళ్యాణ మండపం వద్దకు తీసుకుని వెళ్లడం జరుగుతుందని అన్నారు. రాత్రి 8 గంటలనుండి 10 గంటల వరకు స్వామి వారి కళ్యాణం కన్నులపండువగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఫిబ్రవరి 28వ తేదిన ఉదయం రుద్రాభిషేకాలు, మధ్యాహ్నం పూర్ణాహుతి కార్యక్రమం, అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. శుక్రవారం నాడు సాయంత్రం స్వామి వారిని అమ్మవారిని అలంకరణ చేసిన నందివాహనం పై పట్టణ వీధులలో శోభాయాత్ర కన్నులపండువగా జరుగుతుందని అన్నారు. శుక్రవారం రాత్రి 9 గంటల నుండి అన్నపూర్ణ దేవికి కుంకుమ అర్చనలు నిర్వహిస్తామని, అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని, తమవంతు సహాయ సహకారాలు అందించాలని తెలిపారు.







## పదండి పోదాం నందివనపర్తి జాతర

- దేవాలయాలకు పుట్టినిల్లుగా విరాజిల్లుతున్న గ్రామం
- రేపటి నుండి మూడు రోజుల పాటు సాగనున్న మహాశివరాత్రి ఉత్సవాలు
- విద్యుత్ దీపాలతో ఆలయం అలంకరణ
- వివిధ ప్రాంతాల నుండి రానున్న భక్తులు
- భక్తుల కోసం ఏర్పాట్లు పూర్తి
- నందీశ్వర క్షేత్రంలో ఎనిమిదడుగుల నంది

ఇబ్రహీంపట్నం, విశాలభారతి: పండుగల్లో మహాశివ రాత్రి ప్రశస్త్యమైనది. శివభక్తులకు అత్యంత పర్వదినం మహా శివరాత్రి. పరమశక్తి స్వరూపుడైన పరమ శివుడి అనుగ్రహం లేనిదే ఈ మానవుడైన ముందడుగు వేయలేడు. ప్రపంచమంత శివుడిమాయలో నిండి ఉన్నది. అలాంటి మహా మాన్విత ప్రదేశం, పచ్చని ప్రకృతి మధ్య ప్రశాంత వాతావరణంలో ఆహ్లాదమైన ప్రదేశస్థలంలో శివుడు, పార్వతిదేవిల నందీశ్వర మహాక్షేత్రం రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని నందివనపర్తి గ్రామంలో కొలువైంది. మహాశివరాత్రి వేడుకకు నందివనపర్తి నందీశ్వర ఆలయం అంతా సిద్ధమైంది. ప్రతీ ఏడూ జరిగే శివరాత్రి జాతరకు ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ఈనెల 26 న శివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు నిర్వాహకులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశారు. జాతరకు వివిధ జిల్లాల నుంచి భక్తులు రానున్న సందర్భంగా అసౌకర్యం కలుగ కుండా ఉండేందుకు ఆలయ నిర్వాహకులు పటిష్ట స్థితిలో ఏర్పాట్లు చేశారు. దేవాలయానికి రంగులు, చలువ పందిళ్లు, తాగునీరు, ప్రాథమిక చికిత్స ఇతర ఏర్పాట్లు చేస్తున్నారు.

**మహాక్షేత్రానికి శతాబ్దాల చరిత్ర**

నందీశ్వర మహాక్షేత్రానికి శతాబ్దాల చరిత్ర కలిగి ఉంది. ఉపవాస దీక్షలతో రాత్రంతా జాగరణ చేసి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులకు వసతులు ఏర్పాటు చేశారు. దేవాలయంలోకివెళ్ళగానే 8 అడుగుల స్వయంబు మహానంది దర్శనమవుతుంది. గర్భగుడిలోని పార్వతి దేవికి ఎదురుగా శివలింగం ఉండడం గమనార్హం. ఒకేవరుసలో ఈ మూడు కేంద్రీకృతమై ఉండడం అరుదని చరిత్ర కారుల అభిప్రాయం.

**ఆలయ చరిత్ర....**

గతంలో నందీశ్వరాలయం శిథిలావస్థకు చేరడంతో పల్లానాగేందర్రావు అనువంశికులు 1967లో ఆలయం పునర్నిర్మించారు. 1968లో మొట్టమొదటిగా మహాశివరాత్రి పురస్కరించుకొని ఆలయంలో ఉత్సవాలు నిర్వహించారు. అప్పటినుంచి నేటి వరకు దిగ్విజయంగా ఉత్సవాలు ఆలయ నిర్వాహకులు నిర్వ హిస్తున్నారు. మహాశివరాత్రి జాతర ఉత్సవాలు రేపటి 3 నుంచి శుక్రవారం వరకు నిర్వహిస్తున్నామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ ఏడాది భక్తుల తాకిడి ఎక్కువగానే ఉంటుందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వాహనాల పార్కింగ్, తాగునీరు సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**మూడు రోజుల కార్యక్రమాలు..**

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నందీశ్వర మహాక్షేత్రంలో మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా అఖండ దీపారాధన, గణపతి పూజ, కలశ స్థాపన ధ్వజారోహణం, రుద్రాభిషేకాలు జాగారం ఉంటుంది. రెండవరోజు రుద్రాభిషేకాలు, శివపార్వతుల కల్యాణోత్సవం అన్నదానం చివరిరోజు రథోత్సవం ఉంటాయని నిర్వహకులు తెలిపారు.

**బైలైన్**
**గుండెమోని శివకుమార్**

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం,
25.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## మఖానా సూపర్ ఫుడ్.. ఏడాదిలో 300 రోజులు తీసుకుంటా

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**
మఖానా సూపర్ ఫుడ్ అని, అది ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకారి అని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. 365 రోజుల్లో 300 రోజులు అది తన ఆహారంలో భాగమయ్యేలా చూసుకుంటానని వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఉన్న చాలామంది ప్రజలకు అల్పాహారంలో మఖానా ఉంటుందని, అంతర్జాతీయ స్థాయిలో దాని ఉత్పత్తి ఉండాలని పేర్కొన్నారు. సోమవారం బిహార్‌లోని భాగల్‌పుర్‌లో పర్యటించిన సందర్భంగా.. తన ఆహారపు అలవాటు గురించి చెప్పారు. రైతుల శ్రేయస్సు కోసం బిహార్‌లో మఖానా బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు వార్షిక బడ్జెట్‌లో నిర్మలాసీతారామన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. 'మఖానా బోర్డు ఏర్పాటుకు రూ.100 కోట్లు కేటాయిస్తున్నాం. ఈ బోర్డు ద్వారా ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్ అవకాశాలు మెరుగుపడతాయి. రైతులకు శిక్షణ అందుతుంది. వారు అన్ని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలనూ పొందేలా బోర్డు చూస్తుంది' అని మంత్రి వివరించారు. దీనికి గుర్తుగా భాగల్‌పుర్ కార్యక్రమంలో మోదీకి మఖానాతో చేసిన దండను వేసి గౌరవించారు.



## పార్ట్ టైం ఆధ్యాపకులను ప్రభుత్వం ఆదుకోవాలి

- టీజీఆప్ట

**విశాలభారతి,ఓయూ:**
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్శిటీలలో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులకు అందరికీ 12 నెలల జీతం 50,000 ఇచ్చేవిధంగా సిఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఐ ఏఎస్, సభ్యులు ప్రొ. పీఎల్ విశ్వేశ్వరరావు, డా.చారకొండ వెంకటేష్ , జ్యోత్స్నా శివారెడ్డి బషీర్ బాగ్ లోని విద్యాశాఖ చైర్మన్ కార్యాలయంలో కలిసిన తెలంగాణ పార్ట్ టైం లెక్చరర్ల అసోసియేషన్ (టీజీ ఆప్ట) సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న పార్ట్ టైం లెక్చరర్లు కు వెంటనే కాంగ్రెస్ మేనిఫెస్టో (2023) అమలు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని విద్యాశాఖ కమిషన్ చైర్మన్,సభ్యుల ను కోరారు. ఈ సందర్భంగా విద్యాశాఖ కమిషన్ చైర్మన్, మరియు సభ్యులు సానుకూలంగా స్పందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మీకు న్యాయం చేసేలా చూస్తామని చెప్పినట్లు చెప్పారన్నారు.ఈ కార్యక్రమంలో టిజిఆప్ట వ్యవస్థాపక అధ్యక్షులు డా. బి రవీందర్ గౌడ్, రాష్ట్ర అధ్యక్షులు డా. ఎస్. కిరణ్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఎర్రం నాగేంద్రం, వైస్ ప్రెసిడెంట్ డా.మర పాల కుమార స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ డా. పి.శ్రీలక్ష్మి రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ లు డా. బిక్షమయ్య, డా.మంచాల లింగస్వామి, డా. వావిల్ల కుమారస్వామి, డా రవీందర్,పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాస్ కుమార్.



మృతుడు నసీరుద్దీన్ (ఫైల్ ఫోటో)



నిందితుడు ఫక్రుద్దీన్

## చందానగర్ మర్డర్ మిస్టరీ చేదించిన చందానగర్ పోలీసులు

- గోపినగర్ చెరువు దగ్గర జరిగిన హత్య కేసులో పురోగతి

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**
స్నేహితుడే కాలయముడై కర్రతో కొట్టి చంపిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కలకలం సృష్టించింది.చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్ లో నివాసముండే నసీరుద్దీన్ ను అదే బస్తీకి చెందిన ఫక్రుద్దీన్ శుక్రవారం రాత్రి 8.30 గంటలకు గోపిచెరువు వద్దకు మాట్లాడుదామని చెప్పి తీసుకెళ్లి తన స్నేహితులు బురాన్,మహమ్మద్ ఖలీమ్, అజార్,మొహమ్మద్ అలీ,తో కలసి ఫక్రుద్దీన్ హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలను మియాపూర్ ఏసిపి శ్రీనివాస్ కుమార్ సోమవారం విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఈ మేరకు ఏసిపి మాట్లాడుతూ..పథకం ప్రకారం ముందుగానే హత్య చేయాలని ఉద్దేశంతోనే నసీరుద్దీన్ ను చెరువు దగ్గరకు తీసుకెళ్లి మద్యం తాగించి హత్య చేసినట్లు తెలిపారు.తన కుటుంబం పై చేతబడి చేశారని అనుమానంతో ఈ హత్య చేసినట్లుఏసిపి తెలిపారు.అనంతరం పారిపోతున్న నసీరుద్దీన్ వెంబడించి పట్టుకున్నారని అది గమనించిన స్థానికులు ఎదురు తిరగడంతో హాస్పిటల్లో చేరుస్తానని ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి కొండాపూర్ ఏరియా ఆసుపత్రి లో వదిలి వెళ్ళినట్టు ఏసిపి శ్రీనివాస్ కుమార్ తెలిపారు. అనంతరం పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫక్రుద్దీన్ లొంగి పోయాడన్నారు.కేసు విషయమై విచారించగా పూర్తి వివరాలు వెల్లడించినట్లు చెప్పారు.అనంతరం నిందితులు ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.ఈ కార్యక్రమంలో మియాపూర్ సిఐ క్రాంతి కుమార్, చందా నగర్ సిఐ పాలవెల్లి ఎస్ ఐ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**మరో ఘటనలో...**
మియాపూర్ లో మహిళ కిడ్నాప్ ఆపై రేప్ కేసును ఛేదించిన మియాపూర్ పోలీసులు
ఈనెల 21వ తేదీ తెల్లవారుజాము మియాపూర్ వై జంక్షన్ దగ్గర మతిస్థిమితం లేని ఒక మహిళను కిడ్నాప్ చేసి ఆపై రేప్ చేసి న ఘటన కు సంబంధించిన ఇద్దరు నిందితులను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. చందానగర్ కు చెందిన నిందితులు బల కుమార్(25),మహేష్(24) గా గుర్తించారు.వీరు ఒక మహిళను ద్విచక్ర వాహనంపై బొల్లారం నిర్మానుష ప్రాంతాలకు తీసుకెళ్లి హత్యాచారం చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని ఏసిపి శ్రీనివాస్ కుమార్ తెలిపారు. కిడ్నాప్ పైన వెంటనే 100 కాల్ రాగా వెంటనే స్పందించిన మియాపూర్ పోలీసులు మూడు టీములు గాలించి కేవలం మూడు గంటల్లోనే మహిళను రిస్క్ చేశారని ఏసీపీ తెలిపారు. అనంతరం సిసి ఫుటేజ్ ద్వారా నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు ఆయన చెప్పారు. వారిపై ఇదివరకే పలు పోలీస్ స్టేషన్ లో కేసులో ఉన్నాయన్నారు. నిందితుల వద్ద నుండి యాక్టివా వాహనం,రెండు మొబైల్ ఫోన్ లు స్వాధీనం చేసుకున్నాను. అనంతరం రిమాండ్ కు తరలించామని ఏసిపి తెలిపారు.



## జవహర్ బాల్ మంచ్ సంవద్ 2025జాతీయ సదస్సు

- ప్రత్యేక అతిథిగా తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ జిట్ట సునీల్ యాదవ్

**కూకట్ పల్లి,విశాలభారతి:**
కర్ణాటక రాష్ట్రం బెంగళూరు లోని కేంబ్రిడ్జ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ CIT లో జరుగుతున్న జవహర్ బాల్ మంచ్ Samvaad 2025 రెండవ జాతీయ సదస్సులో ప్రత్యేక అతిథిగా తెలంగాణ రాష్ట్ర జవహర్ బాల్ మంచ్ స్టేట్ కోఆర్డినేటర్ జిట్ట సునీల్ యాదవ్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. జాతీయ జవహర్ బాల్ మంచ్ చైర్మన్ జి వి హరి,కర్ణాటక రాష్ట్ర విద్యా శాఖ మంత్రి వర్యులు ఏం సి.సుధాకర్ కేంబ్రిడ్జ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అధినేత డికె,మోహన్, కేంబ్రిడ్జ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ CEOడికె. నితిన్ ,తెలంగాణ రాష్ట్ర జవహర్ బాల్ మంచ్ చైర్మన్ మామిడి రిషికేశ్ రెడ్డి, జాతీయ కోఆర్డినేటర్ లు, వివిధ రాష్ట్రాల చైర్మన్లు కోఆర్డినేటర్ లు తదితరులు పాల్గొన్నారు.



## ఆలయాల వద్ద పరిశుభ్రత పాటించాలి

- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

**పెద్ద అంబర్పేట్,విశాలభారతి:**
హయత్ నగర్ డివిజన్ లో బుధవారం రోజున మహాశివరాత్రి పురస్కరించుకొని ఆలయాల వద్ద భక్తులకి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవలాయల చుట్టుపక్కల ఎలాంటి చెత్త చెదారం డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా సంబంధిత శానిటేషన్ జవాన్ రామ్ చందర్ కి సూపర్వైజర్లు జవాన్ మధుకి తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది వెంకట్ రెడ్డి, రాజ్ కుమార్,యాదయ్య సంబంధిత తదితర అధికారులు పాల్గొనడం జరిగింది.



## దశదిన కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రెస్ క్లబ్ సభ్యులు

**గరిడేపల్లి, విశాలభారతి:**
ప్రెస్ క్లబ్ మిత్రులు సీనియర్ పాత్రికేయులు నమస్తే తెలంగాణ రిపోర్టర్ తాటికొండ లక్ష్మణ్ నాన్న తాటికొండ వెంకటయ్య దశదిన కార్యక్రమాల్లో భాగంగా గరిడేపల్లి ప్రెస్ క్లబ్ మిత్రులు పాల్గొని తాటికొండ వెంకటయ్య ఫోటోకు పూలమాలతో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ జిల్లా నాయకులు పైడిమర్రి రంగనాథ్, మాజీ జెడ్పిటిసి పెండెం శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్ రెడ్డి, వాసవి క్లబ్ అధ్యక్షులు గేల్లి సతీష్, పలువురు మండల ప్రముఖులు, గరిడేపల్లి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కదారు వెంకటేశ్వర్లు, శివ, సీనియర్ రిపోర్టర్స్ గురవయ్య, భిక్షం, గోరంట్ల శ్రీనివాస్,ఉపేందర్, కుర్ర గోపి, సుందరయ్య, షేక్ అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం..

- తల్లిదండ్రులు లేని సమయంలో ఇంటి నుండి వెళ్లిపోయిన యువతి



**పెద్ద అంబర్పేట్,విశాలభారతి:**
హయత్ నగర్ పోలీస్ స్టేషన్ సాయి నగర్ కాలనీ, పెద్ద అంబర్పేట్ కు చెందిన పిన్నపురాల శ్రీజ తండ్రి రాంబాబు 23 సంవత్సరాల యువతి 24 ఫిబ్రవరి 2025న ఉదయం సుమారు పది గంటల సమయంలో యువతీ ఇంటి నుండి బయటకు వెళ్లినట్లు ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా నాగరాజు గౌడ్ మాట్లాడుతూ వివరాల్లోకి వెళితే శ్రీజ తల్లిదండ్రులు పని నిమిత్తం బయటకు వెళ్లిన సమయం చూసి ఇంటి నుండి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోవడం జరిగిందని వారి తల్లిదండ్రులు పని ముగించుకొని తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి తన కూతురు శ్రీజ కనిపించకపోవడంతో తన కూతురు ఎక్కడికి వెళ్ళిందో అని బంధుమిత్రులకు స్నేహితుల మరియు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికిన ఎటువంటి ఆచుకి లభించకపోవడంతో శ్రీజ తల్లి పిన్నపురాల లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఫిర్యాదు రాలికి ఇద్దరు కూతుర్లు ఒక కుమారుడు సంతానం ఉన్నట్లు పిన్నపురాల శ్రీజ ఇంటర్ సంవత్సరం వరకు చదివి ప్రస్తుతం ఇంటి వద్దనే ఖాళీగా ఉంటున్నట్లు తెలిపారు.



## ఘనంగా మాథూర్ విద్యాలయ వార్షికోత్సవ వేడుకలు

- సాంస్కృతిక కార్యక్రమాలు పాల్గొన్న విద్యార్థులు,
- విద్యార్థులను అభినందించిన పాఠశాల యజమాన్యం

**సికింద్రాబాద్, విశాలభారతి:**
మాథూర్ విద్యాలయ హైస్కూల్ వారాసిగూడ 12వ వార్షిక వేడుకలను బిఎన్ఆర్ గార్డెన్స్ నామలగుండులో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ట్రేస్మా గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి కె. శివరామ కృష్ణ ఆచార్య, ముషీరాబాద్ మండల అధ్యక్షులు సందీప్ కుమార్‌ల తో పాటు మాథూర్ పాఠశాల కార్యదర్శి డాక్టర్ ఆర్‌వి ఎల్ఎన్ ప్రసాద్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు. పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు,వివిధ నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్లే బ్యాక్ సింగర్స్ వినాయక్ సతీష్, నిహారిక పాడిన పాటలు హైలైట్ గా నిలిచాయి స్కూల్ ప్రిన్సిపాల్ ఆర్ రాజేశ్వరి. ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.




## పేరూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నార్కోటిక్ స్నిఫర్ డాగ్ టీం తో తనిఖీలు

**వాజేడు, విశాలభారతి:**
ములుగు జిల్లా ఎస్పీ శ్రీ డాక్టర్ శబరిష్ , ఎటునాగారం ఏ ఎస్ పి శ్రీ శివం ఉపాధ్యాయ ఆదేశానుసారం వెంకటాపురం సిఐ బండారి కుమార్ ఆధ్వర్యంలో పేరూరు ఎస్ఐ జి.కృష్ణప్రసాద్ పోలీసు సిబ్బంది మరియు సిఆర్పిఎఫ్ తో కలిసి పేరూరు,ధర్మవరం గ్రామాలలోని అన్ని కిరాణా షాపులు, పేరూరు పోలీస్ స్టేషన్ పరిధి గ్రామాల పరిసరాల ప్రాంతాలను మరియు చత్తీస్గడ్ నుంచి వచ్చే వెళ్లే వాహనాలను నార్కోటిక్ స్నిఫర్ డాగ్ టీంతో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. మండలంలో ఎవరైనా గంజాయి అమ్మిన మరియు సేవించిన కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు. సమాచారం తెలిపిన వ్యక్తులకు తగిన బహుమతి ఇస్తూ వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని తెలియజేశారు.

## అంతరాయం కలిగిస్తే చర్యలు



**బాల్కొండ,విశాలభారతి:**
చిరు వ్యాపారులు,తోపుడు బండ్ల వారు ట్రాఫిక్ కు అంతరాయం కలిగించే విధంగా ప్రవర్తిస్తే మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని మున్సిపల్ కమీషనర్ గోపు గంగాధర్ హెచ్చరించారు. సోమవారం పట్టణంలో ఆయన ట్రాఫిక్ కు అంతరాయం కలుగుతున్న చోట్లను స్వయంగా పోలీసులతో కలిసి పరిశీలించారు. పాత బస్టాండ్ లో ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తున్న తోపుడు బండ్ల వ్యాపారులు తమ బండ్లను క్రమపద్ధతిలో నిలుపు కోవాలని సూచించారు.సిబ్బంది చేత లైనింగ్ వేయించారు.తోపుడు బండ్లు, చిరు వ్యాపారులు ట్రాఫిక్ కు అంతరాయం కలిగించ రాదని ఆదేశించారు.అనంతరం పలు టిఫిన్ సెంటర్ లను తనిఖీ చేసి ప్లాస్టిక్ వాడుతున్న యజమానులకు జరిమానా విధించారు.ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది,పోలీస్ సిబ్బంది ఉన్నారు.



## పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి
- అధికారులకు సూచించిన కలెక్టర్

ఇబ్రహీంపట్నం,విశాలభారతి:

పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే ఇంటర్మీడియట్ , పదవ తరగతి పరీక్షలల్లో విద్యార్థులు ఈవిద్యా సంవత్సరంలో 100/100 శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని విద్యాశాఖ అధికారికి సూచించారు. పదవ తరగతిలో సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ఆయా సబ్జెక్టులలో ప్రత్యేక తరగతులు నిర్వహించి మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాల , కళాశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ తదితరులు పాల్గొన్నారు..

## సెమీస్‌కు భారత్, న్యూజిలాండ్

విశాలభారతి, స్పోర్ట్స్ బ్యూరో:

ఛాంపియన్స్ ట్రోఫీలో గ్రూప్-ఎ సెమీస్ బెర్తులు తేలిపోయాయి. గ్రూప్‌లోని నాలుగు జట్లు ఇంకా ఒక్కో మ్యాచ్ ఆడాల్సి ఉండగానే.. సెమీస్ రేసు ముగిసిపోయింది. రెండేసి విజయాలతో భారత్, న్యూజిలాండ్ నాకౌట్‌కు దూసుకెళ్లగా.. ఆడిన రెండు మ్యాచ్‌లూ ఓడిన పాకిస్థాన్, బంగ్లాదేశ్ టోర్నీ నుంచి నిష్క్రమించాయి. న్యూజిలాండ్‌పై బంగ్లాదేశ్ గెలుస్తుందేమో అని దింపుడుకల్లం ఆశలతో ఉన్న పాకిస్థాన్‌కు.. ఆ కోరిక తీరలేదు. బంగ్లాతో మ్యాచ్‌లో కఠిన పరిస్థితులు ఎదురైనప్పటికీ, దృఢంగా నిలిచిన కివీస్.. తనతో పాటు భారత్ సెమీస్ బెర్తునూ ఖాయం చేసింది. సోమవారం జరిగిన మ్యాచ్ (గ్రూప్-ఎ)లో కివీస్ 5 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై గెలిచింది. మొదట బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 236 పరుగులే చేయగలిగింది. బ్రాస్‌వెల్‌తో పాటు ఒరౌర్క్ (2/48) బంగ్లాను దెబ్బతీశారు. నజ్ముల్ శాంటో (77; 110 బంతుల్లో 9×4) టాప్ స్కోరర్. రచిన్‌తో పాటు లేథమ్ (55; 76 బంతుల్లో 3×4) రాణించడంతో లక్ష్యాన్ని న్యూజిలాండ్ 46.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ మ్యాచ్‌లో బంగ్లా గెలిస్తే రేసులో ఉండొచ్చనుకున్న ఆతిథ్య పాకిస్థాన్‌కు తీవ్ర నిరాశ తప్పలేదు. అవమానకర రీతిలో ఆ జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించింది.





## కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించండి

- సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో దావోస్ వేదికగా తెలంగాణకు 2 లక్షల కోట్ల పెట్టుబడులు
- ప్రైవేట్ రంగంలో వేల మందికి ఉపాధి కల్పన
- యువతకు నైపుణ్యాల కల్పనకు స్కిల్ యూనివర్సిటీ ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ కు పట్టం కట్టండి
- కాంగ్రెస్ నేతలు మెట్టు సాయి కుమార్, నీలం మధు, కాట శ్రీనివాస్ గౌడ్

పటాన్ చెరు,విశాలభారతి

ఉమ్మడి మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నరేందర్ రెడ్డిని గెలిపించాలని రాష్ట్ర ఫిషరీస్ సొసైటీస్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, కాంగ్రెస్ నేతలు నీలం మధు ముదిరాజ్, కాట శ్రీనివాస్ గౌడ్ కోరారు. సోమవారం పటాన్ చెరు నియోజకవర్గంలోని అశోక్ నగర్ సితార గ్రాండ్ లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిక్షణం నిరుద్యోగుల పక్షాన నిలబడి పోరాటం చేస్తూ ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ ఒక ఏడాదిలోనే 56వేల ప్రభుత్వ ఉద్యోగాలను ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ వైపే పట్టబద్రులు ఉన్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. గత పది ఏళ్లలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన నిరుద్యోగులకు పెద్దపీటవేస్తూ అధికారం చేపట్టిన ఏడాదిలోనే 56వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగులను ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. నిరుద్యోగులకు భరోసా గా నిలబడుతూ జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తూ మరిన్ని ప్రభుత్వ ఉద్యోగాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు. ప్రభుత్వ రంగంలోనే కాకుండా ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలతో పాటు ఉపాధి కల్పన మార్గంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు పోతున్న విషయాన్ని నిరుద్యోగులు గమనించాలన్నారు. గత నెలలో దావోస్ వేదికగా జరిగిన అంతర్జాతీయ సదస్సులో తెలంగాణకు రూ. ఒక లక్ష అరవై అయిదు వేల కోట్ల పెట్టుబడులు వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ పెట్టుబడుల ద్వారా సుమారు వేల మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి లభించనుందన్నారు. ప్రైవేట్ రంగంలో యువతకు మెరుగైన వృత్తి నైపుణ్యాలను కల్పించే దిశగా తెలంగాణ ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీని నెలకొల్పి అత్యుత్తమ ప్రమాణాలతో వివిధ రంగాలలో శిక్షణ అందిస్తుందన్నారు. దానికి తోడు విద్యార్థి దశ నుంచే నైపుణ్యాలు పొందేలా ప్రతి నియోజకవర్గానికి ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నెలకొల్పి అత్యుత్తమ విద్యను అందించే విధంగా కృషి చేస్తుందన్నారు. తెలంగాణలోని పట్టబద్రులు చైతన్యవంతులని తమకు అన్ని విధాల న్యాయం చేస్తున్న రేవంత్ రెడ్డి సేవలను వారు అర్థం చేసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల మద్దతు కాంగ్రెస్ పార్టీకే ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. గ్రాడ్యుయేట్ ఓటర్లంతా ఉమ్మడి మెదక్ ఆదిలాబాద్ నిజామాబాద్ కరీంనగర్ పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు,ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంకుంట అంక్షారెడ్డి , ప్రధాన కార్యదర్శులు రఘురాం శివాంత్ రెడ్డి, షామిలి, పట్టభద్రులు,పటాన్చెరు నియోజకవర్గ మున్సిపల్ అధ్యక్షులు మండల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్

పటాన్ చెరు,విశాలభారతి:

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి దర్శించుకున్నారు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి సేవలో పాల్గొన్నారు. అనంతరం తన సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి కుమారుడు గూడెం సంతోష్ రెడ్డి వివాహం సందర్భంగా స్వామి వారి ఆలయంలో తొలి వివాహ పత్రికను అందించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుపతి వెంకన్న ఆశీస్సులతో పటాన్ చెరు ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే జిఎంఆర్ వెంట ఆయన సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మాజీ ఎంపీటీసీ కొల్కురి రామచంద్రా రెడ్డి, గూడెం సందీప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## రంజాన్ మాసం ఉపవాస దీక్షల క్యాలెండర్ ఆవిష్కరణ

- ఆవిష్కరించిన కాట శ్రీనివాస్ గౌడ్, మెట్టు సాయి కుమార్

పటాన్ చెరు,విశాలభారతి:

పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ తో కలిసి రంజాన్ మాసం ఉపవాస దీక్షల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ముస్లిం సోదరులతో కలిసి వారు క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మెట్టు సాయికుమార్, కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలు కఠోర నియమాలతో ఉపవాస దీక్షలు చేపడతారని తెలిపారు. ఈ దీక్షలు భక్తితో పాటు ఆరోగ్యదాయకమని తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు వారు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ పవిత్ర మాసం అందరికీ శాంతి, ఆనందం, అభివృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వరప్రసాద్ రెడ్డి, హబీబ్ జానీ, సలీం తదితరులు పాల్గొన్నారు.

## అపోలో డెంటల్ ను ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే

కాప్రా,విశాలభారతి:

హిల్ టాప్ కాలనీ సైనిక్ పూరిలో నూతనంగా ఏర్పాటు చేసిన అపోలో డెంటల్ ని ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. వ్యాపార రంగంలో రాణించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నల్ల రాధ కృష్ణ Dr రాహుల్ రెడ్డి నవీన్ గౌడ్, మహేష్ గౌడ్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## 'విద్యుత్ సమస్యలను పరిష్కారానికి సదస్సు'

తుర్కయంజాల్,విశాలభారతి:

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి మంగళవారం రోజున వినియోగదారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని తుర్కయంజాల్ సబ్ స్టేషన్‌లో ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి సీజీఆర్ఎఫ్ చైర్ పర్సన్, టెక్నికల్, ఫైనాన్స్ సభ్యులు, పలువురు నిపుణులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. దీర్ఘకాలికంగా ఉన్న విద్యుత్ సమస్యలతో పాటు కరెంట్ బిల్లుల హెచ్చుతగ్గులపై వినియోగదారులకు పరిష్కారం లభించే అవకాశం ఉందన్నారు. ఈ సదవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.




## గాలక్సీ లేజర్ సర్జరీ హాస్పిటల్‌ను ప్రారంభించిన బండి రమేష్

కూకట్ పల్లి,విశాలభారతి:

కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని కెపిహెచ్బి కాలని రోడ్ నెంబర్4లో గాలక్సీ లేజర్ సర్జరీ హాస్పిటల్ ను కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై హాస్పిటల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి రమేష్ హాస్పిటల్ యజమాని డాక్టర్ సుభాకర్,సుజిత్ కుమార్ లను శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.ఈ కార్యక్రమంలో, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు ,ప్రవీణ్, నళిని కాంత్, శివ చౌదరి, బచ్చు మళ్ళీ, ఫణి కుమార్, బాలరాజు, నయీమ్ తదితరులు పాల్గొన్నారు





## గీతంలో విజయవంతంగా ముగిసిన 'కళాభావన ఆలోచనల కళ' కార్యశాల

- ప్రధాన శిక్షకుడిగా ప్రముఖ ఆర్కిటెక్ట్, అర్బన్ డిజైనర్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిశాంత్

పటాన్ చెరు,విశాలభారతి

గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, హైదరాబాద్ లో 'కళా భావన ఆలోచనల కళ' అనే అంశంపై ఇటీవల నిర్వహించిన రెండు రోజుల కార్యశాల విజయవంతంగా ముగిసినట్టు కార్యక్రమ సమన్వయకర్తలు రమ్య గీతిక, ఏ.సంకీర్తన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఇది విద్యార్థుల సృజనాత్మక ఆలోచన, ప్రభావవంతమైన ఆలోచనల అభివృద్ధిపై అవగాహనను మరింతగా పెంచడానికి రూపొందించినట్టు వారు తెలిపారు. ప్రముఖ ఆర్కిటెక్ట్, అర్బన్ డిజైనర్, నాగపూర్ లోని ప్రియదర్శిని ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆర్చిటెక్చర్ అండ్ డిజైన్ స్టడీస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిశాంత్ హెచ్ మనాపురే ప్రధాన శిక్షకుడిగా వ్యవహరించారన్నారు. ఆర్కిటెక్చరల్ ప్రాజెక్టులపై అవగాహన ఏర్పరచడానికి, వాటిని విజయవంతంగా పూర్తిచేయడానికి శక్తివంతమైన సాధనంగా 'ఉన్నతంగా ఆలోచించడం' యొక్క ప్రాముఖ్యతను ప్రొఫెసర్ మనాపురే తొలి రోజు కార్యశాలలో నొక్కి చెప్పినట్టు తెలిపారు. కమ్యూనికేషన్ కళను మెరుగుపరచడంపై దృష్టి సారించి, విద్యార్థులు తమ ఆలోచనలను సమర్థవంతంగా తెలియజేయడానికి వీలు కల్పించిందన్నారు. ఇక రెండవ రోజు, థీసిస్ విద్యార్థుల కోసం రూపొందించిన ఇంటెన్సివ్, యాక్టివిటీఆధారిత సెషన్ అని, ఇందులో ముఖాముఖి చర్చలు నిర్వహించినట్టు తెలియజేశారు. అస్పష్ట ఆలోచనలను ప్రభావవంతమైన భావనలుగా మార్చడంలో ఇది విద్యార్థులకు ఉపకరించిందన్నారు. ఈ ముఖాముఖి విధానం లోతైన అవగాహనను, అర్థవంతమైన మార్పిడిని పెంపొందించిందని, ఇందులో పాల్గొన్న వారందరి ఆసక్తిని రెట్టింపు చేసినట్టు తెలిపారు. ఈ కార్యశాల ఒక పరివర్తనాత్మక అభ్యాస అనుభవంగా నిరూపితమైందని, విద్యార్థులను విమర్శనాత్మక ఆలోచనా నైపుణ్యాలు, ఉచ్చారణలో స్పష్టత, వారి సృజనాత్మక దృక్పథాలను ఆచరణలోకి తీసుకురావడానికి ఆత్మవిశ్వాసంతో సన్నద్ధం చేసినట్టు కార్యక్రమ సమన్వయకర్తలు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

మంగళవారం,
25.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com






# దేవాలయానికి రూ. 50,116 విరాళం

- తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి

**నూతనకల్ విశాలభారతి:**
నూతనకల్ మండల వెంకేపల్లి గ్రామంలోని శ్రీశ్రీశ్రీ సీతారామాంజనేయ స్వామి, శ్రీరామలింగేశ్వర స్వామి వార్ల దేవాలయం లో ద్వితీయ వార్షికోత్సవ సందర్భంగా పూజలు నిర్వహించి, దేవాలయానికి 50,116 రూపాయలను తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల ప్రజలు రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని పాడిపంటలు బాగా పండి రైతులకు ,ప్రజలకు మంచి జరగాలని కోరుకున్నామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ చిర్ర విజయ్ కుమార్ ,మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తోనుకునూరి సైదులు గౌడ్, కమిటి సభ్యులు, గ్రామస్తులు ఇమ్మడి జయకుమార్, సైరెడ్డి శంభా రెడ్డి, ఇమ్మడి విజయ్ కుమార్, తీగల ప్రీతం రెడ్డి, పేర్ల గంగరాజు, పాశం శ్రీనివాస్ రెడ్డి ,దేశగాని మల్లయ్య, పాల్వాయి పరుశరాములు, మారోజు సదానంద చారి, పాలవరపు కృష్ణమూర్తి, చిలువేరు శివ, తీపిరెడ్డి లింగారెడ్డి, తీపిరెడ్డి దిలీప్ రెడ్డి, ఆకుల గణేష్, మారగాని వెంకటయ్య పాల్గొన్నారు.

# కుక్కలకు నిలయంగా మారిన సీతారాంపురం స్కూల్

**డోర్నకల్, విశాలభారతి:**
జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని సీతారాంపురం స్కూల్లో కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. పని నిమిత్తం ఓ రిపోర్టర్ వెళ్లగా ఆయనపై దాడి చేసి గాయపరిచాయి. పిల్లలు, వంట వండుతున్నావాళ్లు, పిల్లల తల్లి దండ్రులు కూడా వస్తుంటారు. ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, తిరుగుతున్నారు, ఇలా కుక్కలు స్కూల్లో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. స్కూల్ లో సార్ కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి, కుక్క కరిసింది అని వెళ్లి స్కూల్ లో అడగగా దురుసుగా సమాధానం ఇచ్చారు. అయినా పట్టించుకోని సీతారాంపురం స్కూల్ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు అనంతరం మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రానికి వెళ్లగా డాక్టర్ గుగులోతు రవి కుక్క కరిసిన రిపోర్టర్ చింత వెంకన్న,ను చూసి, వైద్యం చేసి తగు సూచనలు ఇచ్చారు.



# విద్యుత్ షాక్ తో యువతి మృతి



**నర్సింహులపేట, విశాలభారతి:**
మండలంలోని వంతడపుల స్టేజి గ్రామానికి చెందిన ముదిశెట్టి శైలజ (30) ఆదివారం రాత్రి విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. రాత్రి కారం, పిండి పట్టే మిల్లుకు శుభ్రం చేస్తు, పట్టా కప్పుతున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కు గురైంది. వెంటనే గమనించిన తల్లి జయమ్మ ,పక్కన ఉండే వారి సహాయంతో 108 లో హాస్పిటల్ కు తీసుకెళ్లగా చనిపోయింది అని తెలిసింది, మృతురాలికి ఓ కుమారుడు ఉన్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.





# ప్రజలపై బీరప్ప, మల్లన్న స్వాముల ఆశీస్సులు ఉండాలి

- కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్
- బీరప్ప స్వామి, మల్లికార్జున స్వాములకు ప్రత్యేక పూజలు

**పటాన్ చెరు,విశాలభారతి**
బీరప్ప, మల్లన్న స్వామి ఆశీస్సులు ప్రజలపై ఉండి తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ముత్తంగిలో నిర్వహిస్తున్న బీరప్ప, మల్లికార్జున స్వాముల జాతరలో ఆయన పాల్గొన్నారు. స్వాములకు ప్రత్యేక పూజల అనంతరం నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ జాతరలు ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి ని ప్రతిబింబిస్తాయని తెలిపారు. గ్రామాల్లో జరిగే ఉత్సవాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడం తో పాటు ప్రజలంతా ఐక్యమత్యంగా కలిసి ఉంటారన్నారు. ఆ బీరప్ప, మల్లన్న స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షులు పుల్ల కృష్ణ, చిల్వరి శ్రీనివాస్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, నాయకులు అశోక్, సంజీవ్, దానయ్య, సందీప్ యాదవ్, ప్రవీణ్, కృష్ణ చారి, మల్లేష్, రాజు, కాళి, శంకర్, ప్రవీణ్, దత్తు, నందు, గ్రామ పెద్దలు, ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# మా జోలికి వస్తే తాట తీస్తాం

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ

**దేవరుప్పల, విశాలభారతి:**
మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో మండల కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో మీడియా సమావేశాన్ని నిర్వహించగా పాలకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు గత పది సంవత్సరాలుగా ఎన్నో అక్రమాలు చేసి సామాన్యులను భయభ్రాంతులకు గురి చేసి ఎంతోమంది అమాయక ప్రజలపై అక్రమ కేసులు పెట్టారని,ఇప్పటికీ ఈ మండలంలో కొంతమంది బిఆర్ఎస్ నాయకులు ఆగడాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని,నాలుగు రోజుల క్రితం ఇదే మండలంలోని లకావత్ తండాకు చెందిన గిరిజన యువకుడిపై బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు,అతని అనుచరులు వారి గుండాయిజం ప్రదర్శించి దాడి చేయడం జరిగిందని,ఈ విషయమై బాధితుడు దేవరుప్పుల మండల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయమని సంబంధిత అధికారులను కోరగా విచారణ చేపట్టిన పోలీసులు దోషులను పట్టుకునే ప్రయత్నం చేయగా మండలం వదిలి దొంగల్లా తిరుగుతున్నారని,ఇక్కడ అధికారులపై కూడా దౌర్జన్యం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల యూత్ అధ్యక్షుడు పులిగిళ్ల వెంకన్న,సీనియర్ నాయకులు కాసరపు ధర్మారెడ్డి,మాజీ మండల అధ్యక్షుడు ఉప్పుల సురేష్ బాబు,దౌపటి నర్సయ్య,బానోతు భాస్కర్,గ్రామ పార్టీ అధ్యక్షుడు బోడ యాకన్న,నునావత్ నర్సింహా పాల్గొన్నారు.



# ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయండి

- కమిషనర్ అమరేందర్‌రెడ్డి

**తుర్కయంజాల్,విశాలభారతి:**
మున్సిపాలిటీలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని తుర్కయంజాల్ పురపాలిక కమిషనర్ అమరేందర్‌రెడ్డి తెలిపారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్వీకరణ పై రాగన్నగూడ వార్డు ఆఫీసులో సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ సీడీఎంఏ, కలెక్టర్ ఆదేశాల మేరకు టీపీవో, ఆర్వో, ఆర్ఐ, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు దరఖాస్తుల స్వీకరణ గురించి శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. అధికారులు ఒకరినొకరు సమన్వయం చేసుకొని ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. వీలైనన్ని ఎక్కువ దరఖాస్తులు పరిష్కరించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్వో శ్రీనివాస్, టీపీవో దినేష్, ఆర్ఐ వినయ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- ప్రజావాణికి 70 ఫిర్యాదులు
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి వెల్లడి

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**
ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు అందజేసిన అర్జీలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీతలతో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావానికి 70 దరఖాస్తులు అందాయనీ కలెక్టర్ తెలిపారు..



# వైభవంగా దేవస్థానంలో శివరాత్రి జాతర ప్రారంభోత్సవం

**నేరేడుచర్ల విశాలభారతి:**
సోమవారం ఉదయం సుప్రభాత సేవ రజారోహణం రుద్రహోమం చేశారు.30 మంది పోలీస్ సిబ్బంది,మరియు 35 మంది పారిశుద్ధ్య కార్మికులు, కార్యదర్శులు మరియు అయ్యగార్లు, ఎండ వేడిమికి తట్టుకోవడానికి సమయాన్నియాలు, మంచినీరు అన్ని ఏర్పాటు చేయడం జరిగినది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం పూట ప్రారంభోత్సవం చేశారు. ఆలయ చైర్మన్ చిత్తనూరు సత్యనారాయణ, వైస్ చైర్మన్ లొడంగి లక్ష్మయ్య,డైరెక్టర్లు పెండ్యం సైదులు,పగిడిమర్రి సోములు,మాలోత్ బాలామణి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొనతం చిన్న వెంకటరెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ తల్లా సురేష్‌రెడ్డి, బెల్లంకొండ నరసింహ రావు, గ్రామ ముఖ్య నాయకులు రహీం, గ్రామ కమిటీ అధ్యక్షుడు ప్రవీణ్, మండల ప్రధాన కార్యదర్శి అజయ్, గ్రామ పెద్దలు కృష్ణారావు, పెండ్యం సైదులు సొందు అబ్బాసు, వెంకయ్య పాల్గొన్నారు.

# ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

**ఎల్బీనగర్ ,విశాలభారతి:**
మన్సూరాబాద్ డివిజన్లో ఫుట్ పాత్ ఆక్రమణలపై జీహెచ్ఎంసీ అధికారులు కొరడా ఝులిపిం చారు. ఫుట్‌పాత్, రోడ్లు ఆక్రమించి ఇష్టానుసారంగా అక్రమంగా వేసిన షెడ్లతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతుండటంతో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే దిశగా జీహెచ్ఎంసీ అధికారులు చొరవ చూపారు. ఎల్బీనగర్ కామినేని చౌరస్తా నుంచి మన్సూరాబాద్ చౌరస్తా మీదుగా సహారా స్టేట్స్ కాలనీ సమీపం వరకు రోడ్డుకు ఇరువైపులా వెలసిన అక్రమ నిర్మాణాలను తొలగించారు. రెండు జేసీబీల సహకారంతో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు జరిపారు. జీహెచ్ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్యామ్‌సన్ పర్యవేక్షణలో అక్రమ నిర్మాణాల తొలగింపు చేపట్టారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య సుమారు 100కు పైగా ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు.ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ అధికారులు మాట్లాడుతూ.. రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మాణాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ ప్రతాప్, టీపీఎస్ అక్బర్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



# క్రీడాకారుడికి నేతాజీ వాకర్స్ చేయూత

**మణుగూరు, విశాలభారతి:**
జాతీయ స్థాయి అథ్లెటిక్ క్రీడాకారుడు అపక సతీష్ కు మణుగూరు నేతాజీ వాకర్స్ ఆర్థికంగా రూ.10వేలు చేయూత అందించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దుమ్ముగూడెం మండలం, మారాయిగూడెం గ్రామానికి చెందిన అపక సతీష్ రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. గత నెల జనవరి కేరళ కున్నాంకులంలో నిర్వహించిన అల్ ఇండియా సీనియర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ 100, 200 మీటర్ల రన్నింగ్ విభాగాల్లో గోల్డ్, లాంగ్ జంప్ విభాగంలో బ్రాంజ్ పతకాలు సాధించాడు. ప్రస్తుతం బెంగుళూరులో జరిగే ఏసియా జాతీయ అథ్లెటిక్ క్రీడల్లో పాల్గొనేందుకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం నేతాజీ వాకర్స్ టీమ్ దృష్టికి రావడంతో వారు వెంటనే స్పందించి మణుగూరు లోని శ్రీ భార్గవ ఆటో మొబైల్స్ లోని ఎన్ విజయ భాస్కర్ రెడ్డి, రావులపల్లి రామూర్తి సారధ్యంలో సోమవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా నేతాజీ వాకర్స్ మాట్లాడుతూ అథ్లెటిక్స్ జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి భద్రాద్రి జిల్లాకు, ప్రాంతానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో మణుగూరు నేతాజీ వాకర్స్ ఎన్ విజయ భాస్కరరెడ్డి, తాళ్లపల్లి యాదగిరి గౌడ్, సామ శ్రీనివాస రెడ్డి, కటకం సతీష్, వడ్డాణం రమేష్, మైత్రి శంకర్ రెడ్డి, జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు, వాగబోయిన నాగేశ్వరరావు, కొరిమిల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# చిల్లేపల్లి టోల్ గేటు ఎత్తివేయాలి

- సీపీఐ డిమాండ్

**నేరేడుచర్ల, విశాలభారతి:**
చిల్లేపల్లి వద్ద ఉన్న టోల్ గేటును ఎత్తివేయాలని సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయ నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం నాడు ఆయన సిపిఐ ముఖ్య నాయకులతో కలిసి పార్టీ కార్యాలయం ప్రజాభవన్ లో పాత్రికేయులతో మాట్లాడుతూ నేషనల్ హైవే కోదాడ నుంచి చిల్లేపల్లి టోల్గేట్ వరకు కేవలం 38 కిలోమీటర్లు మాత్రమే ఉన్నదని, హైవే నుంచి టోల్గేటుకు 60 కిలోమీటర్ల దూరంలో ఉండాల్సింది. కానీ 38కిలోమీటర్ల కి టోల్ గేటును ఏర్పాటు చేయడం సరికాదని,అందువల్ల టోల్ గేటు తక్షణమే ఎత్తివేయాలని ఆయన కోరారు.
సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అమరారపు పున్నయ్య, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు చిలకరాజు శ్రీను, ఏఐఎస్ఎఫ్ నాయకుడు కొమ్మరాజు వెంకట్, సిపిఐ నాయకులు గోరుగంతం శ్రీను, ఆకారపు జానకి రాములు, ఎస్ కే భాష ఉన్నారు.



cinema updates



## అర్జున్ సర్కార్ అదుర్స్

నేచురల్ స్టార్ నాని ప్రతీ సినిమాతో కూడా డిఫరెంట్ కంటెంట్ తో సర్ ప్రైజ్ చేస్తున్నాడు. ఎలాంటి సినిమా చేసినా కూడా అందులో ఏదో ఒక కొత్త పాయింట్ ఉండాల్సిందే. అయితే ఈసారి హిట్ 3లో నాని ఎంచుకున్న పాత్ర ఊహాలకందని ఊచకోత తరహాలో ఉన్నట్లు అనిపిస్తోంది. అర్జున్ సర్కార్ అనే పవర్ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా, నాని తన అగ్రెసివ్ యాటిట్యూడ్‌తో అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు. అతని లుక్, బాడీ లాంగ్వేజ్, ఎక్స్‌ప్రెషన్స్ మొత్తం కొత్తగా ఉన్నాయి. నేడు నాని పుట్టినరోజు సందర్భంగా రిలీజైన టీజర్‌లో నాని ఊచకోత అంటే ఏంటో చూపించాడు. కాశ్మీర్ బ్యాక్ డ్రాప్స్, టెర్రర్ అలాగే మర్డర్ మిస్టరీ లాంటి అంశాలు గట్టిగానే ఉన్నట్లు అర్థమవుతుంది. దర్శకుడు శైలేష్ కొలను ఈసారి హిట్ సీరీస్ ను యాక్షన్ బ్యాక్ డ్రాప్ గట్టిగానే ప్లాన్ చేసినట్లు అర్థమవుతుంది. ఇక అతని లాటికి దొరికితే విలన్స్ కు కష్టమే అన్నట్లు క్యారెక్టర్ ను హైలెట్ చేశారు. మొదటి సారి చూసిన వెంటనే, నాని స్క్రీన్ ప్రెజెన్స్ ఎంత పవర్‌ఫుల్‌గా ఉందో స్పష్టంగా తెలుస్తోంది. తెల్లటి సూట్, బ్లాక్ బో టై, చేతిలో రక్తం అంటిన కత్తి ఈ లుక్ చూసినవాళ్లలో వణుకు పుట్టించేలా ఉంది. నాని ఈ సినిమాలో విలన్లను తరిమికొట్టడమే కాదు, వాళ్లు అనుకున్నది కన్నా పదింతలు భయంకరంగా బదులిచ్చే పోలీస్‌గా మారాడు. టీజర్‌లో నాని వేసే ప్రతి స్టెప్, చూపించే ప్రతి ఎక్స్‌ప్రెషన్ ఒక రేంజ్‌లో ఉంది. ప్రత్యేకంగా ఫైట్ సీక్వెన్స్ అయితే ఈ సినిమాలో హైలైట్‌గా నిలిచేలా ఉంది. నాని ఈ రేంజ్‌లో యాక్షన్ చేయడం, విలన్లను చూస్తూ సరిగ్గా స్మైల్ ఇస్తూ దాడి చేయడం, టీజర్ మొత్తాన్ని హై ఓల్టేజ్ స్థాయిలో ఉంచింది. హిట్ 3 కేవలం ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ మాత్రమే కాదు, ఒక బ్రూటల్ యాక్షన్ మూవీ అని చెప్పకనే చెప్పింది. హిట్ ఫ్రాంచైజ్‌లో ఇదే మోస్ట్ వయలెంట్ చాప్టర్ అని టీజర్ ద్వారా స్పష్టమవుతోంది. దర్శకుడు శైలేష్ కొలను ఈసారి కథను మరింత హార్డ్ హిట్టింగ్‌గా తీసుకువచ్చినట్లు అర్థమవుతోంది. హిట్ 1, 2లతో పోలిస్తే, ఈ సినిమాలో యాక్షన్ కూడా డబుల్ అయింది. ఒక కేసును చేదించడంలో అర్జున్ సర్కార్ ఎంతవరకు వెళ్తాడో, ఎంత కఠినంగా వ్యవహరిస్తాడో టీజర్ చూపిస్తోంది. ఈ సినిమాను ప్రశాంతి త్రిపిర్నేని భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ప్రతి షాట్‌లోనూ గ్రాండ్‌నెస్ కనిపిస్తుంది. టీజర్‌లో బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, సినిమాటోగ్రఫీ అన్ని హై క్వాలిటీ టెక్నికల్ వర్క్‌ను ప్రతిబింబిస్తున్నాయి. నాని హిట్ 3లో అందించే థియేట్రికల్ ఎక్స్‌పీరియెన్స్ వేరే స్థాయిలో ఉంటుందని చెప్పవచ్చు. ఇక హిట్ 3 మే 1న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ అవుతోంది. ఇక టీజర్ కంటే సినిమా ఇంకెంత వయలెంట్‌గా, థ్రిల్లింగ్‌గా ఉండబోతుందో చూడాలి.

## మాస్ కా దాస్‌తో డ్రాగన్ బ్యూటీ

రీసెంట్ గా రిలీజైన ప్రదీప్ రంగనాథన్ డ్రాగన్ అదే తెలుగులో రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ సినిమాలో నటించిన కయదు లోహార్ కి తెలుగు ఆడియన్స్ ఫిదా అయ్యారు. సినిమా సక్సెస్ లో కథ కథనం ఎంత ఇంపార్టెంటో నటీనటులు కూడా అంతే ప్రాముఖ్యత వహిస్తారు. ఈ క్రమంలో డ్రాగన్ సినిమాలో అనుపమ పరమేశ్వరన్ ఒక హీరోయిన్ గా నటించగా సెకండ్ హాఫ్ లో కయదు లోహార్ ఎంట్రీ అదిరిపోతుంది. యూత్ ఫుల్ ఎంటర్టైనర్ గా వచ్చిన డ్రాగన్ సినిమాలో కయదు ఆడియన్స్ హృదయాలను కొల్లగొట్టింది. సినిమాలో అమ్మడి లుక్స్, యాక్టింగ్ అంతా పర్ఫెక్ట్ గా అనిపించింది. అమ్మడి ఫీచర్స్ చూసిన ఎవరైనా సరే స్టార్ మెటీరియల్ అనేస్తున్నారు. ఐతే కయదు లోహార్ తొలి సినిమా డ్రాగన్ అనుకుంటున్నారు కానీ అమ్మడు ఆల్రెడీ నాలుగేళ్ల నుంచి సినిమాలు చేస్తుంది. 2021 లో కన్నడలో ముగిల్పేటే సినిమాలో నటించిన అమ్మడు 2022 లో శ్రీ విష్ణుతో అల్లూరి సినిమాలో కూడా నటించింది. ఐతే ఆ సినిమా సరిగా ఆడకపోవడం వల్ల అమ్మడిని ఎవరు పట్టించుకోలేదు. కానీ ఇప్పుడు డబ్బింగ్ సినిమా డ్రాగన్ తో అమ్మడు సూపర్ క్రేజ్ తెచ్చుకుంది. తెలుగు యూత్ ఆడియన్స్ అయితే కయదు ఫ్యాన్స్ గా మారిపోయారు. పర్ఫెక్ట్ బాడీ షేప్ తో కుర్రాళ్లకు పిచ్చెక్కించేలా ఉంది ఈ అమ్మడు. గ్లామర్ తో పాటు యాక్టింగ్ లో కూడా టాలెంట్ చూపిస్తున్న ఈ చిన్నది ఇప్పుడు తెలుగులో లక్కీ ఛాన్స్ అందుకుంది. మాస్ కా దాస్ విశ్వక్ సేన్ అనుదీప్ కెవి కాంబినేషన్ లో ఫంకీ సినిమా వస్తుంది. ఈ సినిమాలో హీరోయిన్ గా మొన్నటిదాకా ఆషిక రంగనాథ్, కృతి శెట్టిల పేర్లు వినపడ్డాయి. కానీ ప్రస్తుతం ఈ చిత్ర యూనిట్ కయదు లోహార్ ని సంప్రదించినట్టు తెలుస్తుంది. విశ్వక్ సేన్ సినిమాలో కయదు దాదాపు ఓకే అయినట్టే అని తెలుస్తుంది. తెలుగులో అల్లూరి చేసినా పెద్దగా ఆకట్టుకోలేని కయదు లోహార్ డబ్బింగ్ సినిమాతో క్రేజ్ తెచ్చుకుని ఇప్పుడు మళ్లీ విశ్వక్ ఫంకీ తో రీ ఎంట్రీ ఇస్తుంది. మరి ఈ సినిమాతో అమ్మడు ఏ రేంజ్ లో సక్సెస్ అందుకుంటుందో చూడాలి. డ్రాగన్ రిలీజైన టైం నుంచి సోషల్ మీడియాలో కయదు గురించి ఎక్కువ చర్చ నడుస్తుండటం విశేషం.



## మోడ్రన్ లుక్‌లో రకుల్



రకుల్ ప్రీత్ సింగ్.. ఎప్పుడూ కూడా తన గ్లామర్ స్టైల్‌తో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసే హీరోయిన్. తాజాగా ఆమె షేర్ చేసిన ఫొటోషూట్ ఇమేజస్ నెట్టింట్లో తెగ వైరల్ అవుతున్నాయి. తెల్లటి కార్సెట్ టాప్, బ్లాక్ కార్గో ప్యాంట్ ధరించి, స్టైలిష్ పోజులతో రకుల్ ఆకట్టుకుంటోంది. ఆమె తన ఫేవరేట్ అవుట్‌ఫిట్ అంటూ ఈ ఫోటోలను షేర్ చేయడం, నెటిజన్లను మరింత ఆకర్షిస్తోంది.ఫొటోల్లో రకుల్ ప్రీత్ సింగ్ తన లుక్‌కి మోడ్రన్ టచ్ ఇస్తూ సింపుల్ యట్ క్లాసీ స్టైల్‌లో కనిపించింది. ఆమె ధరించిన వైట్ కార్సెట్ టాప్ ఆమె ఫిట్‌నెస్‌ను హైలైట్ చేస్తోంది. ముఖ్యంగా నడుము వయ్యారాలు మరింత హైలెట్ అవుతున్నాయి. బ్లాక్ ప్యాంట్‌తో కలిపిన ఈ అవుట్‌ఫిట్ ఆమె లుక్‌కి మరింత బూస్ట్ ఇచ్చింది. మెటాలిక్ హాండ్ జ్యూవెల్రీ, హూప్ ఇయర్రింగ్స్, స్టైలిష్ షూస్ తో ఆమె లుక్ మెరిసిపోతోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ ఫొటోలను పంచుకుంటూ, ఇలా ఉండే అవుట్ ఫిట్స్ నా ఫేవరేట్ అనే క్యాప్షన్ ఇచ్చింది రకుల్. ఈ లుక్‌లో ఆమె తన సొగసుతో మాత్రమే కాకుండా, తన కాన్ఫిడెన్స్ తో కూడా మెరిసిపోతుంది. ఆమె చూపులు, ఎక్స్‌ప్రెషన్స్ ఈ ఫొటోలకు మరింత లైఫ్ ఇస్తున్నాయి. ప్రస్తుతం రకుల్ ప్రీత్ సింగ్ తన కెరీర్‌లో బిజీగా ఉంది. బాలీవుడ్‌లో కొన్ని ప్రాజెక్ట్స్ చేస్తూనే, సౌత్ చిత్ర పరిశ్రమలో కూడా తన గుర్తింపు కాపాడుకుంటోంది. ఈ ఫొటోషూట్ ఆమె ఫ్యాషన్ సెన్స్‌ను మరోసారి నిరూపించాయి. ఇక చివరగా తెలుగులో అమ్మడు 2021లో కొండపొలం అనే సినిమాలో కనిపించింది. ఆ తరువాత బాలీవుడ్ లో అలాగే తమిళంలో బిజీగా కనిపించింది. ముఖ్యంగా ఆమె ఆశలు పెట్టుకున్న కొన్ని సినిమాలు సరైన ఫలితాన్ని ఇవ్వలేదు. ఇండియన్ 2 బిగ్గెస్ట్ డిజాస్టర్ గా నిలివడం కూడా ఆమె కెరీర్ పై ప్రభావం చూపింది. మరి రాబోయే ఇండియన్ 3తో అయినా అమ్మడు ఫామ్ లోకి వస్తుందో లేదో చూడాలి.


Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.